


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 12 సంచిక : 153 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం శనివారం 7 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :153 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM SAT 7 FEBRUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur



## రుణ గ్రహీతలకు ఊరట.. కీలక వడ్డీ రేట్లు యథాతథం

- రెపో రేటును యథాతథంగా ఉంచిన ఆర్బీఐ
- 5.25 శాతంగా కొనసాగనున్న వడ్డీ రేటు
- ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్న ద్రవ్య పరపతి కమిటీ
- ద్రవ్యోల్బణం అదుపులోనే ఉందని వెల్లడి
- 'న్యూట్రల్' విధానానికే కట్టుబడిన రిజర్వ్ బ్యాంక్

మిగతా2లో

## ఈ తరహా రాజకీయాన్ని ఎలా ఎదుర్కోవాలో నాకు తెలుసు

- బలప్రదర్శన కాదు.. అభివృద్ధి ముఖ్యమన్న చంద్రబాబు
- రాయలసీమను ఉద్యాన హబ్‌గా మార్చి చూపిస్తామని వెల్లడి
- గత ప్రభుత్వంలో పోలవరం డయాఫ్రామ్ వాల్ కొట్టుకుపోయిందని విమర్శ
- కల్తీ నెయ్యితో లడ్డూ ప్రసాదం తయారు చేయించారని ఆరోపణ
- భవిష్యత్తులో విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ

**పెన్ పవర్ డెస్క్:**వైసీపీ అధినేత జగన్ పరామర్శ యాత్రలపై సీఎం చంద్రబాబు ఎదురుదాడికి దిగారు. పరామర్శల పేరుతో గంటల తరబడి ట్రాఫిక్ ఆపి ప్రజలను ఇబ్బంది పెట్టడం, బలప్రదర్శనలతో రౌడీయిజం చేయడం వంటి రాజకీయాలు తన దగ్గర చెల్లవని, ఈ తరహా రాజకీయాన్ని ఎలా ఎదుర్కోవాలో తనకు బాగా తెలుసని అన్నారు. ప్రజా సమస్యలపై పోరాడకుండా కేవలం

మిగతా2లో



# టీం 11... కల్తీకి, హత్యలకు బ్రాండ్ అంబాసిడర్లు

- బూత్ మేనేజ్‌మెంట్ వర్క్‌షాప్‌లో పాల్గొన్న నారా లోకేశ్
- బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని కార్యకర్తలకు పిలుపు
- విశాఖ ఉక్కును లాభాల్లోకి తెచ్చింది కూటమి ప్రభుత్వమేనని స్పష్టీకరణ
- దేశ పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకి వస్తున్నాయని వెల్లడి



**పెన్ పవర్ డెస్క్:**'టీం 11' బృందం కల్తీ మద్యం, కల్తీ నెయ్యి, బాబాయి హత్యకు బ్రాండ్ అంబాసిడర్లుగా మారిందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో విమర్శించారు. దేవుడిని అడ్డం పెట్టుకుని రూ.250 కోట్లు దోచుకుని, ఇప్పుడు కల్తీ నెయ్యి కేసులో క్లీన్‌చిట్ వచ్చిందంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ దుష్ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టాలని ఆయన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన బూత్ మేనేజ్‌మెంట్ వర్క్‌షాప్‌లో లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "పార్టీ సొంతిల్లు, ప్రభుత్వం కిరాయి ఇల్లు అనే విషయాన్ని జీవితాంతం గుర్తుంచుకోవాలి. నాయకులు ఎంత ఎదిగినా, ఎన్ని ఇబ్బందులు వచ్చినా చివరకు మన దేవాలయం లాంటి టీడీపీ ఆఫీసుకే వస్తారు. పార్టీని బలోపేతం చేసేందుకు మనం అహర్నిశలు కష్టపడాలి" అని చంద్రబాబు చెప్పిన మాటలను గుర్తుచేశారు.

**బూత్ స్థాయి నుంచే పార్టీ పునర్నిర్మాణం**

"గ్రామస్థాయి నుంచి కాదు, బూత్ స్థాయి నుంచి పార్టీని పునర్నిర్మాణం చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టాం. బూత్ స్థాయిలో బలంగా ఉంటేనే టీడీపీ బలంగా ఉంటుంది" అని లోకేశ్ స్పష్టం చేశారు. 2019 ఎన్నికల తర్వాత కొన్ని బూత్‌లలో వేవ్ ఉన్నా ఎందుకు గెలవలేకపోయామనే కారణాలను అన్వేషించాలన్నారు. తన అనుభవాన్ని వివరిస్తూ, "1985 తర్వాత మంగళగిరిలో టీడీపీ జెండా ఎగరలేదు. 2019లో 5,300 ఓట్ల తేడాతో ఓడిపోయినప్పుడు కలిగిన బాధ, ఆవేదన నాలో కసి పెంచింది. ఓడిన చోటే గెలవాలని కార్యకర్తలతో కలిసి బూత్‌ల వారీగా సమీక్షించి, నాలుగేళ్లు తూచా తప్పకుండా పనిచేసి విజయం సాధించాం" అని తెలిపారు. సంస్థాగత నిర్మాణంపై నమ్మకంతోనే గెలిచానని, ఇప్పుడు అదే స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

మిగతా2లో




## జగన్ పరామర్శ యాత్రలో విషాదం..

### జోగి రమేశ్ ఇంటి సమీపంలో వైసీపీ నేత మృతి

- జగన్ పర్యటన నేపథ్యంలో జోగి రమేశ్ ఇంటికి వస్తున్న వైసీపీ నేత
- పల్స్ పడిపోయి కుప్పకూలిన వైసీపీ నేత రాంబాబు

**పెన్ పవర్ డెస్క్:** వైసీపీ అధినేత జగన్ ఇబ్రహీంపట్నం పర్యటన సందర్భంగా విషాదం చోటుచేసుకుంది. మాజీ మంత్రి జోగి రమేశ్ ను పరామర్శించేందుకు ఆయన తాడేపల్లి నుంచి ఇబ్రహీంపట్నంకు బయల్దేరారు. ఈ క్రమంలో జోగి రమేశ్ ఇంటి సమీపంలో వైసీపీ నేత మృతి చెందారు. జగన్ వస్తున్న నేపథ్యంలో జోగి రమేశ్ ఇంటికి వెళుతున్న చిల్లకల్లు గ్రామ వైసీపీ అధ్యక్షుడు డి.రాంబాబు పల్స్ పడిపోయి కుప్పకూలారు. వెంటనే ఆయనను సమీప ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు. మరోవైపు కాసేపటి క్రితం జోగి రమేశ్ ఇంటికి జగన్ చేరుకున్నారు. ఆయన ఇంటిని పరిశీలించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. జగన్ పర్యటన సందర్భంగా ఓ కుర్రాడు కూడా మరణించినట్టు తెలుస్తోంది. బైక్ పై విన్యాసాలు చేస్తూ బార్ గేట్ ను ఢీకొనడంతో అతడు మృత్యువాతపడినట్టు సమాచారం. మృతిచెందిన కుర్రాడిని ఇబ్రహీంపట్నంకు చెందిన భార్గవ్ గా గుర్తించారు.



## ఓడిపోయాక కోర్టుకొస్తారా?

### ప్రశాంత్ కిశోర్ పార్టీ పిటిషన్‌పై సుప్రీం అసహనం

- ప్రశాంత్ కిశోర్ జన్ సురాజ్ పార్టీకి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ
- 2025 బీహార్ ఎన్నికలను రద్దు చేయాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణకు నిరాకరణ
- ఎన్నికల వేళ మహిళలకు రూ.10,000 పంచడంపై పిటిషన్‌లో ఆరోపణలు
- ప్రజలు తిరస్కరించాక కోర్టుకు వస్తారా అంటూ ధర్మాసనం అసంతృప్తి
- పాట్నా హైకోర్టుకు వెళ్లాలని సూచన

మిగతా2లో

## ఇస్లామాబాద్ లో భారీ పేలుడు...

# 69 మంది మృతి



- మృతుల సంఖ్య 69కి చేరగా, 169 మందికి గాయాలు
- నగరంలో ఎమర్జెన్సీని ప్రకటించినట్లు పోలీసు అధికారి వెల్లడి
- గాయపడిన వారిని ఆసుపత్రికి తరలింపు
- ఇస్లామాబాద్‌లోని షియా మసీదులో భారీ పేలుడు
- శుక్రవారం జుమ్మా ప్రార్థనల సమయంలో జరిగిన దాడి
- ఇది ఆత్మాహుతి దాడి అని అనుమానిస్తున్న అధికారులు

**పెన్ పవర్ డెస్క్:**ఆత్మాహుతి దాడి నేపథ్యంలో పాకిస్థాన్ ప్రభుత్వం ఇస్లామాబాద్‌లో ఎమర్జెన్సీ విధించింది. ఇస్లామాబాద్‌లోని షియా మసీదును లక్ష్యంగా చేసుకుని ఆత్మాహుతి దాడి జరిగింది. ఈ దాడిలో మృతుల సంఖ్య 69కి చేరగా, 169 మంది గాయపడ్డారు. నగరంలోని షెహ్జద్ టౌన్ ప్రాంతంలో గల షియా

మిగతా2లో



## హిందూపురంలో కాల్పుల కలకలం..

### రౌడీషీటర్‌పై పోలీసుల ఫైరింగ్

- హిందూపురంలో రౌడీషీటర్‌పై పోలీసుల కాల్పులు
- సీఐ, కానిస్టేబుల్‌పై కత్తితో దాడి చేసి పారిపోయేందుకు యత్నం
- రౌడీషీటర్ నాగేంద్ర కాలిలోకి దూసుకెళ్లిన బుల్లెట్
- నిందితుడిపై ఏపీ, కర్ణాటకలో 90 కేసులు నమోదు
- గతంలో గ్యాంగ్‌రేప్ కేసులోనూ నాగేంద్ర నిందితుడు

**పెన్ పవర్ డెస్క్:** శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం నియోజకవర్గంలో కాల్పుల ఘటన కలకలం సృష్టించింది. చిలమత్తూరు మండలం ఎర్రకొండ అటవీ ప్రాంతంలో

మిగతా2లో

## కేంద్రమంత్రితో కలిసి 'క్వాంటం వ్యాలీ'కి నేడు సీఎం చంద్రబాబు శంకుస్థాపన



- అమరావతిలో 'క్వాంటం వ్యాలీ' ఏర్పాటుకు రంగం సిద్ధం
- నేడు సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ శంకుస్థాపన
- భారత్‌లో తొలి 133 క్యూబిట్ క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు లక్ష్యం
- పరిశోధన, ఉపాధి రంగాల్లో విప్లవాత్మక మార్పులు రానున్నాయని అంచనా
- సామాన్యుడి జీవితంలో మార్పులు తీసుకురానున్న క్వాంటం టెక్నాలజీ

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక సరికొత్త సాంకేతిక అధ్యాయానికి నాంది పలుకుతూ, అమరావతి నేడు ఒక చారిత్రక ఘట్టానికి వేదిక కానుంది. ప్రపంచ క్వాంటం టెక్నాలజీ రంగంలో రాష్ట్రాన్ని, దేశాన్ని అగ్రగామిగా నిలిపే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'అమరావతి క్వాంటం వ్యాలీ' భవన నిర్మాణానికి శనివారం పునాదిరాయి పడనుంది.

మిగతా2లో

# తెలంగాణలో పవన్ కల్యాణ్ ఎన్నికల ప్రచారం రద్దు!

- తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం చేయాల్సి ఉన్న పవన్
- ఎన్నికల ప్రచారం రద్దయినట్టు ప్రకటించిన జనసేన
- అనివార్య కారణాల వల్లే ప్రచారం రద్దయినట్టు సమాచారం



**పెన్ పవర్ డెస్క్:**తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రచారం రద్దయింది. ఇంతకు ముందు వెలువడిన ప్రకారం రేపు, ఎల్లుండి ఆయన ప్రచారం చేయాల్సి ఉంది. తాజాగా ఆయన ఎన్నికల ప్రచారం రద్దయినట్టు

మిగతా2లో

మిగతా2లో

## ఎడిటర్ వ్యూ

# ఒంటరిగా బతకగలమా?

ఈ మధ్య కాలంలో తరచుగా యువత నోట వినిపిస్తున్న మాట కెరీర్ ముఖ్యం, పెళ్లి మా ఎదుగుదలకు ఆటంకం. మేము లక్షల జీతాలు తెచ్చుకుంటున్నాం. అవసరం అయితే ఇంట్లో పనులకు మనుషులను పెట్టుకుంటామనే ధోరణిలో వెళ్లిపోతున్నారు. అయితే, వీరు గ్రహించవలసిన విషయం ఏమిటంటే కొన్నాళ్ల వరకు ఈ జీవితం బాగానే ఉంటుంది. నలభై ఏళ్లు వచ్చాక అప్పుడు వీరిలో ఆలోచన మొదలవుతుంది. అప్పటి వరకు ఉన్న స్నేహితులు వారి వారి జీవితాల్లో స్థిరపడి పోవడం. బంధువులు దూరంగా ఉండటం, తల్లిదండ్రులు పెద్దవారై పోవడం.. ఈ నేపథ్యంలో వారి మనసుల్లో ఒక అలజడి. నిజానికి ఒంటరి జీవితం సుఖాన్ని, సంతోషాన్ని ఇస్తుందా? ముఖ్యంగా పెళ్లి చేసుకుని, పిల్లలు కలిగిన తర్వాత మనస్పర్థల కారణంగా విడిపోయిన జంటలు, ఒంటరిగా ఎన్నో రకాల కష్టాలు అనుభవిస్తున్నారు. ఆడవారు శారీరకంగా, మానసికంగా ఎంతో కష్టాలు పడుతున్నారు.. ఒంటరి జీవితం అనుకున్నంత సౌఖ్యంగా ఉండదు. ఒంటరిగా జీవిస్తూ పిల్లల్ని పెంచడం మరీ కష్టం. విద్యా వికాసం, ఆర్థిక స్వాతంత్రం, స్వతంత్ర భావాలను పెంపొందిస్తున్నాయి. అది ఒంటరి జీవితాన్ని ప్రోత్సహిస్తోంది. కావాలనో, విడాకుల కారణంగానో జీవిత భాగస్వామిని కోల్పోవడం వల్లనో ఇటీవల కాలంలో ఒంటరిగా జీవించే వారి సంఖ్య పెరుగుతోంది. ఒంటరిగా బతకడం వల్ల జీవితాన్ని మన చిత్తం వచ్చినట్లు గడిపే అవకాశం ఉన్నప్పటికీ భవిష్యత్తు పట్ల భయం, పిల్లల ఆర్థిక సామాజిక భద్రతను గురించిన చింత వెంటాడుతూ ఉంటుంది. కొంతమందికి జీవిత భాగస్వామి అకాల మరణం మానసికంగా కుంగదీస్తుంది. ఇంటా బయటా బాధ్యతలు, ఆర్థిక సమస్యలు వెంటాడుతుంటాయి.. దానికి తోడు పిల్లల్ని పెంచడం తలకు మించిన భారం అవుతుంది. గతించిన వారి పేరిట జీవిత బీమా, అదనపు ఆదాయ వనరులు ఉంటే కొంత ఊరట కలుగుతుంది. విడాకులు తీసుకుని వేరుపడిన వారిలో కొందరికి పిల్లల్ని పెంచాల్సిన అదనపు బాధ్యత ఉంటుంది. మనోవర్తి వంటి వాటివల్ల ఆర్థికంగా కొంత నిలదొక్కుకో గలిగినా మనిషి సాయం లేకపోతే కష్టం. మీరు బయటకు వెళ్లినప్పుడు పిల్లలను కనిపెట్టుకుని ఉండేందుకు ఎక్కువ జీతం ఇవ్వాల్సి వచ్చినా మంచి పని మనిషిని పెట్టుకోవాలి. మీ లక్ష్యాలను పెద్ద మొత్తంలో నిధులు అవసరమయ్యే సమయాలను నిర్ధారించుకోండి. పిల్లల, విద్య, వివాహం వంటి అవసరాలను దృష్టిలో ఉంచుకోండి. కావాలని ఇష్టపడి ఒంటరిగా ఉంటూ కుటుంబాన్ని ఏర్పాటు చేసుకుంటే తప్ప ఒంటరి జీవితం నల్లేరుపై నడక కాదు.. జీవితం అంత సాఫీగా సాగదు. అయితే సానుకూల దృక్పథంతో, ముందుచూపుతో ప్రణాళిక రూపొందించుకుంటే ఒంటరి జీవితం గడపడం కొంత కష్టమైనా ఒడిదుడుకులు లేకుండా ముందుకు వెళ్లవచ్చు.. ఏది ఏమైనా ఒక మనిషికి ఇంకొక మనిషి తోడు అవసరం తప్పక కావాలి. అటువంటప్పుడు వివాహం చేసుకుని ఒక కుటుంబాన్ని కలిగి ఉంటే, ఎటువంటి పరిస్థితులు ఎదురైనా సమాజంలో గౌరవం, భద్రత కలిగి ఉంటారు. కుటుంబం వలన ఎంతో కొంత మానసిక ధైర్యం లభిస్తుంది. ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు ఒకటికి పదిసార్లు ఆలోచించి, పెద్దలతో సంప్రదించి నిర్ణయం తీసుకుంటే మంచిది. ఒంటరి జీవితం కొన్నాళ్ల వరకు బాగానే ఉన్నా, తర్వాతర్వాత అభద్రతా భావం కలిగిస్తుంది. కాబట్టి జాగ్రత్త.

# కేంద్రమంత్రితో కలిసి 'క్వాంటం వ్యాలీ'కి నేడు సీఎం చంద్రబాబు శంకుస్థాపన

- మొదటి పేజీ తరువాయి

ఈ కీలక కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్ హాజరుకానున్నారు. తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెం గ్రామంలో ప్రభుత్వం కేటాయించిన 50 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకోనుంది. శనివారం మధ్యాహ్నం 2:45 గంటలకు ముఖ్యమంత్రి తన క్యాంపు కార్యాలయం నుంచి బయలుదేరి 3:00 గంటలకు శంకుస్థాపన ప్రదేశానికి చేరుకుంటారు. సాయంత్రం 6:00 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొని, అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఈ ప్రాజెక్టుతో భారతదేశ క్వాంటం విప్లవానికి ఆంధ్రప్రదేశ్ నాయకత్వం వహించేందుకు మార్గం సుగమం కానుంది.

**రాష్ట్ర భవిష్యత్‌కు మైలురాయి**

అమరావతిలో ఏర్పాటు కానున్న క్వాంటం వ్యాలీ, రాష్ట్రానికే కాక దేశానికే ఒక మైలురాయిగా నిలవనుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. భారతదేశపు మొట్టమొదటి 133 క్యూబిట్ క్వాంటం కంప్యూటర్‌ను అమరావతికి తీసుకురావడంలో ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టి వంటి దిగ్గజ సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ వ్యాలీ కేవలం ఒక భవన సముదాయంగా కాకుండా, ఒక సంపూర్ణ సాంకేతిక పర్యావరణ వ్యవస్థగా అభివృద్ధి చెందనుంది. క్వాంటం కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్స్, క్వాంటమ్ సెన్సార్స్ వంటి అత్యాధునిక రంగాలతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డిఫెన్స్, హెల్త్‌కేర్, ఫైనాన్స్ వంటి కీలక రంగాల్లో పరిశోధనలు, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధికి ఇది కేంద్రంగా మారుతుంది.

దీని ద్వారా ప్రపంచ స్థాయి పరిశోధన సంస్థలు, గ్లోబల్ టెక్నాలజీ కంపెనీల పెట్టుబడులను ఆకర్షించడం, స్టార్టప్ సంస్కృతిని ప్రోత్సహించడం, లక్షలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం సాధ్యమవుతుందని ప్రభుత్వం ఆశిస్తోంది.

**సామాన్యుడికి ప్రయోజనాలు**

క్వాంటం టెక్నాలజీ కేవలం శాస్త్రవేత్తలకే పరిమితం కాదని, దాని ఫలాలు సామాన్యుడి జీవితంలో గణనీయమైన మార్పులు తీసుకువస్తాయని ప్రభుత్వం చెబుతోంది. ఉదాహరణకు, ఫార్మా రంగంలో పరిశోధనలు వేగవంతమై కొత్త ఔషధాలు త్వరగా అందుబాటులోకి వస్తాయి. వ్యాధుల నిర్ధారణ మరింత కచ్చితంగా మారుతుంది. వ్యవసాయ రంగంలో వాతావరణాన్ని, వర్షపాతాన్ని కచ్చితంగా అంచనా వేయడం ద్వారా రైతులు ప్రయోజనం పొందుతారు. అలాగే, బ్యాంకింగ్, డిజిటల్ లావాదేవీల భద్రత మరింత పటిష్టమవుతుంది. ఈ ఏడాది ఆగస్టు నాటికి భవన నిర్మాణం పూర్తిచేసి, డిసెంబర్ కల్లా క్వాంటం కంప్యూటర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఐటీ విప్లవానికి సిలికాన్ వ్యాలీ ఎలా కేంద్రంగా నిలిచిందో, భవిష్యత్తులో క్వాంటం కంప్యూటర్ల తయారీకి, పరిశోధనలకు అమరావతి గ్లోబల్ హబ్‌గా మారుతుందని అంచనా వేస్తున్నారు.

# టీం 11... కల్తీకి, హత్యలకు బ్రాండ్ అంబాసిడర్లు

- మొదటి పేజీ తరువాయి

నాయకులకు, కార్యకర్తలకు దిశానిర్దేశం

ఐదు జోన్లలో 4,772 బూత్‌లను బలోపేతం చేసేందుకు 903 మంది సీనియర్ నాయకులను నియమించినట్లు లోకేశ్ వెల్లడించారు. "ప్రతి నాయకుడు బూత్‌కు కనీసం ఒక రోజు కేటాయించి, అక్కడి పరిస్థితులను తెలుసుకుని, పార్టీ బలోపేతానికి నివేదిక ఇవ్వాలి. ఇకపై బూత్ పనితీరు ఆధారంగానే రాజకీయ భవిష్యత్తు ఉంటుంది. కష్టపడి పనిచేసిన వారికే పార్టీలో పదవులు దక్కుతాయి," అని ఆయన స్పష్టం చేశారు. పసుపు జెండా కోసం ప్రాణాలు త్యాగం చేసిన అంజిరెడ్డి తాత, మంజుల, చెన్నుపాటి గాంధీ, తోట చంద్రయ్య వంటి కార్యకర్తలే తనకు స్ఫూర్తి అని అన్నారు.

**కూటమి ప్రభుత్వ ఘనతలను వివరించాలి**

"దేశానికి వస్తున్న పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వస్తున్నాయి. విశాఖ ఉక్కును లాభాల్లోకి తీసుకువచ్చిన ఘనత డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్‌ది. విశాఖ రైల్వే జోన్ సాధించుకున్నాం. అమరావతి, పోలవరం పనులు వేగవంతం చేశాం. కర్నూలులో త్వరలోనే హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తాం," అని లోకేశ్ తెలిపారు. రూ.4 వేల పింఛను, తల్లికి వందనం, అన్న క్యాంటీన్ల పునఃప్రారంభం, 16 వేల టీచర్ పోస్టుల భర్తీ వంటి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు.

**కూటమిలో విడాకులు ఉండవు**

"రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వ కొనసాగింపు చాలా అవసరం. కనీసం 15 ఏళ్లు కలిసికట్టుగా ముందుకు వెళితేనే అభివృద్ధి సాధ్యమని పవనన్న చెప్పారు. మన కూటమిలో విడాకులు, మిస్ ఫైర్‌లు, క్రాస్ ఫైర్‌లు ఉండవు. ఏవైనా సమస్యలుంటే మూడు పార్టీలు కూర్చొని చర్చించుకుంటాయి. వైసీపీ మన మధ్య విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తుంది, అందరూ అప్రమత్తంగా ఉండాలి" అని లోకేశ్ హితవు పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

# ఈ తరహా రాజకీయాన్ని ఎలా ఎదుర్కోవాలో నాకు తెలుసు

- మొదటి పేజీ తరువాయి

రాజకీయం కోసం బలప్రదర్శనలు చేయడం సరికాదని, ఎన్నికల సమయంలో సత్తా చాటాలని ఆయన హితవు పలికారు. గతంలో కాన్వాయ్‌తో ఒకరి మరణానికి కారణమవ్వడం, బంగారుపాళ్యంలో మామిడి రైతుల కాయలను తొక్కించడం వంటి చర్యలు వారి రౌడీయిజానికి నిదర్శనమని విమర్శించారు.

కర్నూలు జిల్లా, ఎమ్మిగనూరు నియోజకవర్గం, కలుగట్లలో మీ భూమి- మీ హక్కు కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను అందించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి సీఎం ప్రసంగించారు.

గత ఐదేళ్ల పాలనలో శ్రీవేంకటేశ్వర స్వామి ప్రతిష్ఠను దెబ్బతీసేలా కల్తీ ప్రసాదంతో టీటీడీని అపవిత్రం చేశారని చంద్రబాబు తీవ్ర ఆరోపణలు చేశారు. బాత్రూంలు శుభ్రపరిచే రసాయనాలతో తయారుచేసిన కల్తీ నెయ్యితో లడ్డూలు చేయించారని, దీనిపై సీబీఐ, సిట్ క్లీన్‌చిట్ ఇచ్చిందని అబద్ధాలు చెబుతున్నారని అన్నారు. తాము ఇప్పుడు ఆ తప్పును సరిదిద్ది, నాణ్యమైన లడ్డూ ప్రసాదాన్ని అందిస్తున్నామని తెలిపారు. ఒకవైపు ప్రతిపక్ష రాజకీయ శైలిపై విమర్శలు గుప్పిస్తూనే, మరోవైపు తమ ప్రభుత్వ అభివృద్ధి అజెండాను, ముఖ్యంగా రాయలసీమ ప్రగతికి సంబంధించిన ప్రణాళికలను ఆయన వివరించారు. ఒకప్పుడు కరవుతో అల్లాడిన రాయలసీమను ఉద్యాన హబ్‌గా మారుస్తున్నామని, ఏటా 200 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తులు ఈ ప్రాంతం నుంచే వస్తున్నాయని చెప్పారు. డ్రిప్ ఇరిగేషన్ వంటి సౌకర్యాలతో సీమకు నీరందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని అన్నారు. తాను రాయలసీమ బిడ్డనని, ఎన్టీఆర్ కూడా ఈ ప్రాంత ముద్దుబిడ్డేనని గుర్తుచేశారు. గత పాలకులు పోలవరాన్ని గోదాట్లో ముంచేశారని, డయాఫ్రామ్ వాల్ కొట్టుకుపోయేలా చేసి రూ.400 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని విమర్శించారు. ఇప్పుడు తాము అదనంగా రూ.1000 కోట్లతో డయాఫ్రామ్ వాల్‌ను పునర్నిర్మిస్తున్నామని, గోదావరి పుష్కరాల నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీళ్లిచ్చి, శ్రీశైలం నీటిని రాయలసీమకు మళ్లించిన దూరదృష్టి తమదని పేర్కొన్నారు.

రాయలసీమ లిఫ్ట్ పేరిట గత పాలకులు డ్రామాలు ఆడారని, అనుమతులు లేవని ఎన్జీటీ ఆపినా మళ్లీ నాటకాలు మొదలుపెట్టారని ఎద్దేవా చేశారు. తాము వెస్ట్ కర్నూలులో వేదవతి ప్రాజెక్టు, గురు రాఘవేంద్ర, రాజోలిబండ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. గుండ్రేవుల ప్రాజెక్టుపై పొరుగు రాష్ట్రాలతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. భవిష్యత్తులో విద్యుత్ ఛార్జీలు పెంచేది లేదని, ప్రజలపై ఎలాంటి భారం మోపబోమని ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, టీజీ భరత్, ఎంపీ నాగరాజు, స్థానిక ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఓడిపోయాక కోర్టుకొస్తారా?

ప్రముఖ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ స్థాపించిన 'జన్ సురాజ్' పార్టీకి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. 2025 బీహార్ అసెంబ్లీ ఎన్నికలను రద్దు చేసి, కొత్తగా పోలింగ్ నిర్వహించాలని కోరుతూ ఆ పార్టీ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను విచారించేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. పాట్నా హైకోర్టును ఆశ్రయించేందుకు పిటిషనర్‌కు స్వేచ్ఛనిస్తూ, పిటిషన్‌ను ఉపసంహరించుకున్నట్లుగా పరిగణిస్తున్నట్లు పేర్కొంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. జన్ సురాజ్ తరఫున సీనియర్ న్యాయవాది చందర్ ఉదయ్ సింగ్ వాదనలు వినిపించారు. ఎన్నికల సమయంలో అధికార పార్టీ 'ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన' కింద మహిళలకు రూ.10,000 చొప్పున పంపిణీ చేసిందని, ఇది ఓటర్లను ప్రలోభపెట్టడం, లంచం ఇవ్వడం కిందకే వస్తుందని ఆరోపించారు. తీవ్ర ఆర్థిక ఒత్తిడిలో ఉన్న బీహార్‌లో ఇలాంటి పథకం ద్వారా ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని పేర్కొన్నారు.

ఈ వాదనలపై ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. "మీకు ఎన్ని ఓట్లు వచ్చాయి? ప్రజలు తిరస్కరించిన తర్వాత ఉపశమనం కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తారా?" అని ఘాటుగా ప్రశ్నించింది. ఈ పథకంపై అభ్యంతరం ఉంటే సరైన సమయంలోనే సవాల్ చేయాల్సిందని అభిప్రాయపడింది. మొత్తం ఎన్నికల ప్రక్రియను రద్దు చేయాలని కోరడం సరికాదని వ్యాఖ్యానించింది. దేశవ్యాప్తంగా ఉచిత పథకాలపై దాఖలైన ఇతర పిటిషన్లపై విచారణను కొనసాగిస్తామని

స్పష్టం చేసిన ధర్మాసనం, ఎన్నికల్లో ఓడిపోయిన పార్టీ వేసిన ఈ పిటిషన్‌ను మాత్రం విచారించలేమని తేల్చిచెప్పింది. పిటిషనర్ సదుద్దేశాన్ని కూడా పరిశీలించాల్సి ఉంటుందని పేర్కొంది. దీంతో పిటిషనర్ తరఫు న్యాయవాది పాట్నా హైకోర్టును ఆశ్రయించేందుకు అనుమతి కోరగా, ధర్మాసనం అంగీకరించింది.


## వేలము ప్రకటన

**మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్ ) వారి కోర్టు, మచిలీపట్నం**

**ఇ.పి.నెం.17/2024, ఓ.యస్ .నెం. 191/2022**

**బిట్వీన్**

**బొందలపాటి రామకృష్ణారావు** — **డి.హెచ్.ఆర్.**

**ఎదిరి**

**బొందలపాటి రాజమ్మ మరియు ఇతరులు** — **జె.డి.ఆర్స్...**

పై నెంబరు అమలులో జె.డి. ఆర్స్ తాలూకు యీ నెంబరు డిక్రీ బాకీ క్రింద జప్తుకాబడిన దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని శ్రీ కోర్టువారు ది. 23-02-2026వ తేదీన ఉదయం గం.10.30 ని॥లకు పై కోర్టువారిచే వేలం జరుపబడును. సదరు వేలంలో పాల్గొనదలచినవారు కోర్టువారి ఎదుట పై తేదీన ఉదయం గం.10.30 ని॥లకు హాజరై వేలం పాటలో పాల్గొనవచ్చును.

అయిటం నెం.1- కృష్ణా జిల్లా, మచిలీపట్నం సబ్ డి॥ గూడూరు మండలం, మల్లవోలు గ్రామ పంచాయితీ ఏరియా, మల్లవోలు గ్రామ ఆర్.యస్. నెం. 916-1-ఎం-1 లో య.0-73 సెంట్లు మాగాణి భూమికి హద్దులు.
తూర్పు - బొందలపాటి లక్ష్మి గారి భూమి,
దక్షిణ - బొందలపాటి భానుచంద్ గారి భూమి,
పడమర - రావి కస్తూరిబాయి గారి భూమి,
ఉత్తర - బొందలపాటి భానుచంద్ గారి భూమి
యీ హద్దుల మధ్య య. 0-73 సెంట్లు లేదా 0.295 హెక్టార్లు మాగాణి భూమి మరియు

అయిటం నెం. 2 - కృష్ణా జిల్లా, మచిలీపట్నం సబ్ డి॥ గూడూరు మండలం, మల్లవోలు గ్రామ పంచాయితీ ఏరియా, మల్లవోలు గ్రామ ఆర్.యస్. నెం. 916-1-ఎం-1 లో య. 0-47 సెంట్లు ఆర్.యస్. నెం. 916-1-ఎం లో య. 0-26 సెంట్లు వెరశి రెండు నెంబర్ల దాఖలా య. 0-73 సెంట్లు మాగాణి భూమికి హద్దులు.
తూర్పు - బొందలపాటి లక్ష్మి గారి భూమి
దక్షిణ - మురుగునీటి కాలువ
పడమర - బొందలపాటి భానుచంద్ మరియు బొందలపాటి రాజమ్మ గార్ల భూమి.
ఉత్తర - బొందలపాటి భానుచంద్ గారి భూమి

యీ హద్దుల మధ్య య.0-73 సెంట్లు లేదా 0.295 హెక్టార్లు మాగాణి భూమి మరియు

అయిటం నెం.3- కృష్ణా జిల్లా, మచిలీపట్నం సబ్ డి॥ గూడూరు మండలం, మల్లవోలు గ్రామ ఏరియా, మల్లవోలు గ్రామ ఆర్.యస్. నెం. 916-1-ఎం లో య.0-73 సెంట్లు మాగాణి భూమికి హద్దులు.
తూర్పు - బొందలపాటి లక్ష్మి గారి భూమి,
పడమర - మురుగునీటి కాలువ,
ఉత్తరము - రావి కస్తూరిబాయి గారి భూమి.
దక్షిణ - బొందలపాటి రాజమ్మ గారి భూమి,
యీ హద్దుల మధ్య య. 0-73 సెంట్లు లేదా 0.295 హెక్టార్లు మాగాణి భూమి.
ఇ.సి. దాఖలా అన్యాక్రాంతములు ఏమియు లేవు.

మూడు అయిటములు కలపి డి.హెచ్.ఆర్. విలువ - రు. 20,00,000/-
అమీనా విలువ -0.42,00,000/-
ఎస్.ఆర్.ఓ. విలువ - రు. 41,49,500/-

వేలం వాయిదా తేదీ - 23-02-2026
ఫర్దర్ హియరింగ్- 02-03-2026
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

**ఎస్. శ్రీనివాస్,**
డి. హెచ్.ఆర్. తరఫు న్యాయవాది,
రేపల్లె
సెల్. నెం: 9347076161


# రుణ గ్రహీతలకు ఊరట.. కీలక వడ్డీ రేట్లు యథాతథం

భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) కీలక వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచింది. పాలసీ రెపో రేటును ప్రస్తుతమున్న 5.25 శాతం వద్దే కొనసాగించాలని ద్రవ్య పరపతి కమిటీ (ఎంపీసీ) ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ప్రకటించారు. దీంతో పాటు తమ 'న్యూట్రల్ మానిటరీ పాలసీ' వైఖరికే కట్టుబడి ఉన్నట్లు ఆయన స్పష్టం చేశారు. దేశ ఆర్థిక పరిస్థితులు, భవిష్యత్ అంచనాలను జాగ్రత్తగా పరిశీలించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు గవర్నర్ తెలిపారు. గత డిసెంబర్ సమావేశం తర్వాత ప్రపంచవ్యాప్తంగా ప్రతికూలతలు పెరిగినప్పటికీ, ప్రభుత్వం కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాలు ఆర్థిక వ్యవస్థకు సానుకూలంగా ఉన్నాయని ఆయన అన్నారు. ద్రవ్యోల్బణాన్ని నియంత్రిస్తూనే, వృద్ధికి ఆటంకం కలగకుండా సమతౌల్యం పాటించడమే 'న్యూట్రల్' వైఖరి ఉద్దేశమని వివరించారు. ద్రవ్యోల్బణం అదుపులోనే ఉందని, ఆర్బీఐ నిర్దేశించిన సహన పరిమితి కంటే తక్కువగా ఉందని మల్హోత్రా పేర్కొన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి రెండు త్రైమాసికాలకు సీపీఐ ద్రవ్యోల్బణ అంచనాలను వరుసగా 4 శాతం, 4.2 శాతానికి సవరించినట్లు తెలిపారు. భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి అంచనాలు ఆశాజనకంగా ఉన్నాయని, దేశీయ అంశాలే దీనికి కారణమని ఆయన అభిప్రాయపడ్డారు. గత డిసెంబర్‌లో జరిగిన సమీక్షలో వృద్ధిని ప్రోత్సహించేందుకు ఆర్బీఐ రెపో రేటును 5.5 శాతం నుంచి 5.25 శాతానికి (25 బేసిస్ పాయింట్లు) తగ్గించిన విషయం తెలిసిందే. అంతకుముందు ఆగస్టు, అక్టోబర్‌లలో రేట్లను స్థిరంగా ఉంచింది. ప్రస్తుతం రేట్లలో మార్పు లేనందున గృహ, వాహన రుణాలతో సహా ఇతర రుణాలపై వడ్డీ రేట్లు ఇప్పట్లో పెరిగే అవకాశం లేదు.

# తెలంగాణలో పవన్ కల్యాణ్ ఎన్నికల ప్రచారం రద్దు!

- మొదటి పేజీ తరువాయి

జనసేన ప్రకటించింది. ఏపీలో రాజకీయ పరిణామాలు, పవన్ వ్యక్తిగత కారణాల వల్లే ప్రచారం రద్దయినట్టు సమాచారం. మరోవైపు, మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయంలో తెలంగాణ జనసేన నేతలతో ఈ ఉదయం పవన్ భేటీ అయిన సంగతి తెలిసిందే. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల గురించి వారితో పవన్ చర్చించారు. ఎన్నికల్లో అనుసరించాల్సి వ్యూహంపై దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో పార్టీ ఉపాధ్యక్షుడు బొంగునూరి మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, తెలంగాణ ఇంచార్జి శంకర్ గౌడ్, రాజలింగం, సాగర్ (ఆర్కే నాయుడు) తదితర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## ఇస్లామాబాద్ లో భారీ పేలుడు... 69 మంది మృతి

- మొదటి పేజీ తరువాయి

మసీదు ప్రధాన ద్వారం వద్ద పేలుడు సంభవించింది. ఈ పేలుడు వల్ల సమీపంలోని భవనాలు, కిటికీలు కూడా పగిలిపోయాయి. పేలుడు అనంతరం నగరంలో నగరవ్యాప్తంగా ఎమర్జెన్సీని ప్రకటించినట్లు ఇస్లామాబాద్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ వెల్లడించారు. ముఖ్యమైన ప్రదేశాల్లో భద్రతా సిబ్బంది విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. ఈ దుర్ఘటనలో గాయపడిన వారిని పాకిస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, పాలీక్లినిక్ ఆసుపత్రికి తరలించారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఇస్లామాబాద్‌లో జరిగిన ఆత్మాహుతి దాడిని పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ ఖండించారు. ఈ ఘటన అత్యంత బాధాకరమని, పలువురు మృతి చెందారని అన్నారు. ఆత్మాహుతి దాడిని తాను తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు.

## హిందూపురంలో కాల్పుల కలకలం..

- మొదటి పేజీ తరువాయి

నాగేంద్ర అనే రౌడీషీటర్‌పై పోలీసులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో బుల్లెట్ నాగేంద్ర కాలిలోకి దూసుకెళ్లి, అతను తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం, నాగేంద్రను అరెస్ట్ చేసేందుకు సీఐ ఆంజనేయులు, కానిస్టేబుల్ రవి వెళ్లగా, అతను వారిపై కత్తితో దాడి చేశాడు. అనంతరం అక్కడి నుంచి తప్పించుకుని పారిపోతుండటంతో, ఆత్మరక్షణ కోసం సీఐ ఆంజనేయులు అతనిపై కాల్పులు జరిపినట్లు సమాచారం. నిందితుడు నాగేంద్రపై ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో కలిపి సుమారు 90 కేసులు ఉన్నాయి. గతంలో హిందూపురంలో అత్తాకోడళ్లపై జరిగిన గ్యాంగ్‌రేప్ కేసులో కూడా ఇతను ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. చాలాకాలంగా తప్పించుకు తిరుగుతున్న నాగేంద్ర కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ క్రమంలోనే తాజా ఘటన చోటుచేసుకుంది. బుల్లెట్ గాయంతో పట్టుబడిన నాగేంద్రను పోలీసులు అదుపులోకి తీసుకుని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## స్వచ్ఛ రథంతో ఘన వ్యర్ధాల మార్పిడి ద్వారా ... ప్రజలకు నిత్యావసర వస్తువులు



**ఆనందపురం, పెన్ పవర్,ఫిబ్రవరి 06 :**ఆనందపురం మండలంలోని కుసులవాడు గ్రామపంచాయతీలో ఈ రోజు స్వచ్ఛ రథం తిరుగుతూ పొడి చెత్త సేకరణ కార్యక్రమం నిర్వహించింది. ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో ఈ రథం ద్వారా ఇంటింటికీ వెళ్లి పేపర్లు, ప్లాస్టిక్, గాజు సీసాలు, అట్టపెట్టెలు, ఇనుము, స్టీల్ తదితర పొడి వ్యర్థాలను నిర్ణయించిన ధరలకు సేకరిస్తున్నారు.

జనవరి నెలలో ప్రారంభమైన ఈ స్వచ్ఛ రథానికి మండలంలోని ప్రతి పంచాయతీకి ప్రత్యేక షెడ్యూల్ రూపొందించారు. షెడ్యూల్ ప్రకారం నెలకు ఒక్కసారి మాత్రమే ప్రతి గ్రామాన్ని సందర్శించనుంది.

ప్రజలు తమ వద్ద ఉన్న పొడి చెత్తను ముందుగానే దాచిపెట్టి రథం వచ్చినప్పుడు ఆపరేటర్‌కు అప్పగించాలని సూచించారు. అందుకు బదులుగా నిత్యావసర సరుకులు అందజేస్తారు. ఈ కార్యక్రమంతో గ్రామాల్లో పరిశుభ్రత పెరగడమే కాకుండా వ్యర్థాల పునర్వినియోగం కూడా సాధ్యమవుతుందని అధికారులు తెలిపారు.

మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని తమ గ్రామాలను శుభ్రంగా ఉంచాలని కోరారు.


# పెన్ పవర్

## ఉత్తరాంధ్ర

శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

## హుకుంపేట ఐటీడీఏ షాపింగ్ కాంప్లెక్స్‌లో సంవత్సరాల

## తరబడి రాజకీయ అండదండలతో తిష్ట వేసిన అద్దె దారులు






- ★ సంవత్సరాల తరబడి అద్దె బాకీలు
- ★ అద్దె చెల్లించని వారిపై చర్యలేవి?
- ★ ఐటీడీఏ అధికారుల మౌనం ఎందుకు?
- ★ నిరుద్యోగులకు ఇదే భరోసానా?
- ★ ఐటీడీఏ పాలన పై ప్రజాసంఘాలు,
- ★ స్థానికులు ఆగ్రహం .

**పాడేరు, పెన్ పవర్, ఫిబ్రవరి 6:** హుకుంపేట మండల కేంద్రంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లో పలువురు అద్దెదారులు నెలల తరబడి అద్దె చెల్లించకపోయినా సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. ప్రభుత్వానికి చెల్లించాల్సిన అద్దెను నిర్లక్ష్యంగా వదిలేసి షాపులు నిర్వహిస్తున్నా అధికారులు మౌనం పాటించడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీ నష్టం వాటిల్లుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

నిబంధనల ప్రకారం అద్దె చెల్లించని అద్దెదారులకు నోటీసులు జారీ చేయడం, బకాయిలను వెంటనే వసూలు చేయడం, ఆదేశాలు పాటించని పక్షంలో షాపులను సీజ్ చేయడం వంటి చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ ఐటీడీఏ ఆధ్వర్యంలోని ఈ షాపింగ్ కాంప్లెక్స్‌లో మాత్రం ఆ నిబంధనలు కాగితాలకే పరిమితమయ్యాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నెలల తరబడి అద్దె చెల్లించకపోయినా, ఎలాంటి విచారణ లేకుండా షాపులు కొనసాగుతుండడం పాలనా వైఫల్యానికి నిదర్శనమని ప్రజలు అంటున్నారు.

ఒకవైపు ఐటీడీఏ గిరిజన, నిరుపేదల అభివృద్ధి కోసం ఏర్పాటైన సంస్థగా చెప్పుకుంటూ, మరోవైపు ప్రభుత్వ ఆస్తిని వ్యక్తిగత లాభాలకు వాడుకుంటున్న అద్దెదారులపై చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఇదే సమయంలో మండలంలో ఎంతోమంది నిరుద్యోగ యువత ఉపాధి లేక రోడ్డున తిరుగుతున్న పరిస్థితి కనిపిస్తోంది. అద్దె చెల్లించని వారు షాపులు ఆక్రమించి కూర్చుంటే, నిజంగా వ్యాపారం చేయాలనుకునే నిరుపేదలు, గిరిజన యువతకు అవకాశం దక్కకపోవడం ఆవేదన కలిగిస్తోంది.

అద్దె ఎగ్గొట్టిన అద్దెదారులపై తక్షణమే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని, బకాయిలను పూర్తిగా వసూలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిని షాపుల నుంచి ఖాళీ చేయించి అర్హులైన నిరుద్యోగులకు కేటాయించాలని ప్రజలు ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే షాపింగ్ కాంప్లెక్స్ నిర్వహణలో పూర్తి పారదర్శకత తీసుకురావాలని, ఐటీడీఏ అధికారులు తమ బాధ్యతను గుర్తించి వెంటనే చర్యలు చేపట్టాలని పలువురు ప్రజా సంఘ నాయకులు , ప్రజల కోరుతున్నారు.

## నష్టపరిహారం లేకుండానే హైవే పనులు






- ★ తాసిల్దార్ ప్రోత్సాహంతోనే పనులా?
- ★ బాధితుల ప్రశ్న -- న్యాయం ఎక్కడ?

**పాడేరు, పెన్ పవర్, ఫిబ్రవరి 6:**హుకుంపేట మండలం అడ్డమండ పంచాయతీ సన్యాసమ్మ పాలెం గ్రామంలో హైవే విస్తరణ పనులు బాధితులకు నష్టపరిహారం చెల్లించకుండానే నిర్లక్ష్యంగా కొనసాగుతున్నాయి. హైవే కోసం తమ భూమిని త్యాగం చేసినప్పటికీ ఇప్పటివరకు పరిహారం అందకపోవడంతో బాధిత రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామంలో చాలామందికి నష్టపరిహారం చెల్లించిన అధికారులు, కేవలం ఆరుగురు బాధితులను మాత్రమే పక్కన పెట్టడం పలు అనుమానాలకు తావిస్తోంది.కొంత భూమిని హైవే కోసం ఇచ్చిన మోరి .మణికుమారి, నిక్కుల .పాపారావు, మోద శ్రీనివాసరావు, తామర్భ. కొండమ్మ తదితర రైతులు న్యాయం కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నా సరైన సమాధానం దక్కడం లేదని వాపోతున్నారు.

నష్టపరిహారం చెల్లించకుండా పనులు ఎలా చేపడతారని బాధితులు ప్రశ్నిస్తే, స్థానిక తాసిల్దార్ నుంచి స్పష్టమైన సమాధానం లేకపోవడం మరింత ఆగ్రహానికి దారి తీస్తోంది. బాధ్యతను ఇతర శాఖలపైకి నెట్టేస్తూ కాలయాపన చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. అధికారుల బలంతోనే హైవే పనులు సాగుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

భూమి దానం చేసిన ప్రతి బాధితుడికి వెంటనే నష్టపరిహారం చెల్లించాలని, లేకపోతే ప్రజా సంఘాలతో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని గ్రామస్తులు ప్రజాసంఘాలు హెచ్చరిస్తున్నారు. జిల్లా అధికారులు వెంటనే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులకు ఘన సన్మానం

**ఫిబ్రవరి 4న నూతనంగా ఎన్నికైన ఉద్యోగ సంఘం నాయకులు.**

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఫిబ్రవరి 06.**గిరిజన ఉద్యోగుల సంఘం నూతనంగా ఎన్నికైన నాయకులకు మండల కేంద్రంలో గల ఆదివాసి ఫౌండేషన్ భవనం వద్ద శుక్రవారం సాయంత్రం ఉద్యోగులు దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు. 4వ తారీఖు బుధవారం జరిగిన ఉద్యోగ సంఘం ఎన్నికల్లో ముంచంగిపుట్టు మండల అఖిల భారత ఉద్యోగ సంఘం అధ్యక్షునీగా బజ్జంగి బాబురావు, ఉపాధ్యక్షులుగా వెంగడ రవికుమార్, ఏం చిన్నగున్ని పడాల్, కె దాసయ్య ఎన్నుకోబడగా గౌరవ అధ్యక్షునీగా ఎస్ నిలంబరం ఎన్నికయ్యారు. గిరిజన ఉద్యోగుల సంఘం మండల మహిళా అధ్యక్షురాలుగా వంతినిభ నూకాలమ్మ, ఉపాధ్యకురాలుగా కె రత్న కుమారి, కె రాధాలకు ఉద్యోగులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఉద్యోగ సంఘం నాయకులు మాట్లాడుతూ.. గిరిజన ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి తమ వంతు సాయశక్తులు కృషి చేస్తామని వారన్నారు. మండల బాడీ కమిటీ సభ్యులతో ప్రతి విషయాన్ని చర్చించుకుని గిరిజన ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి ఏ విధంగా ముందుకు వెళ్లాలో అందరి నిర్ణయాన్ని తీసుకుని దాని ప్రకారం ముందుకు వెళ్లేందుకు కృషి చేస్తామన్నారు. అదేవిధంగా గిరిజన ఉద్యోగుల సంఘం మండల ప్రధాన కార్యదర్శిలుగా రెయ్యల రామక్రిష్ణరావు, యు సీతారామరాజు, ఎల్ దాసు పద్మరావు ఎన్నిక కాగా, కోశాధికారులుగా జి కామేశ్వరరావు, వి బాలరాజు ఎన్నికయ్యారు. గిరిజన ఉద్యోగుల సంఘం మండల మహిళ ప్రధాన కార్యదర్శిలుగా భవానీ, కె భార్గవి, ఎస్ దమయంతి, ఎల్ పద్మ ఎన్నిక కాగా, సంయుక్త కార్యదర్శులుగా బి శ్రీనివాసరావు, సలహాదారులుగా కోడాలక్ష్మీ, కె కృష్ణరావు, పి గోవిందు, ఎస్ మాలయ్య, సి హెచ్ రమేష్ లను గిరిజన సంఘం ఉద్యోగులు ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అల్లూరి జిల్లా అఖిల భారత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ఏం శేషాద్రి, కె రాంబాబు, ఏం ఈశ్వర్ రావు తో పాటు మండల ఉద్యోగులు పాల్గొన్నారు.




## వినతుల పరిష్కారం వేగవంతం చేయాలి

- ★ సమస్యల పరిష్కారానికి అధికారుల చొరవ చూపించండి
- ★ పిజిఆర్ఎస్ కు 137 అర్జీలు
- ★ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్

**పాడేరు, పెన్ పవర్,ఫిబ్రవరి 06:** సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థకు 137 వినతులు వచ్చాయి. జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్, ట్రైనీ ఇండియన్ ఫారెస్ట్ ఆఫీసర్ చిదానందం, ఇంచార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి అంబేద్కర్, పాడేరు ఇంచార్జ్ ఆర్డివో ఎమ్ వివిఎస్. లోకేశ్వరరావు, సంయుక్తంగా వివిధ మండలాల, గ్రామాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. అర్జీదారుల నుండి స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత శాఖ అధికారులకు అందించి త్వరితగతన పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ సంబంధిత భూ సమస్యలను తక్షణమే పరిష్కరించుటకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నందు ప్రత్యేకంగా రెవెన్యూ క్లినిక్ ని నిర్వహించడం జరుగుతుందని మండల రెవెన్యూ అధికారులు, డిప్యూటీ తాసిల్దారులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు,సర్వేయర్లు,విలేజి రెవెన్యూ ఆఫీసర్లు సంబంధిత సిబ్బంది అందుబాటులో ఉంటారని, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా ఫిర్యాదులను స్వీకరించడం, పరిష్కరించడం జరుగుతుందని కొన్ని రకాల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించడం, పరిష్కరం కానీ ఫిర్యాదులను ఎంత గడువు గడువులోగా పరిష్కరిస్తారో తెలియజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అర్జిదారులు మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలి, అర్జీలు నేటికీ పరిష్కారం కాకపోయినా, ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చున్నారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి వీవవనెశీయిఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ ను సంప్రదించవచ్చున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని అసిస్టెంట్ కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

స్వీకరించిన ఫిర్యాదులు కొన్ని

అరకు మండలం, రవ్వల గూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు హరి బారికి చందు, జాన్ కుమార్, శోభ. సూర్య కిరణ్, కె. స్వప్న, బి. శ్వేత, శిధిలావస్థలో ఉన్న కళాశాల భవనములో తరగతులు నిర్వహించుకోవడానికి ఇబ్బంది పడుతున్నామని, ఆ భవన సముదాయంలో కొత్త భవనం నిర్మించాలని విన్నవించారు.

పెదబయలు మండలం, గంపరాయి పంచాయతీ, జీడిపుట్టు గ్రామానికి చెందిన ఎస్. ఉదయ్ కిరణ్ జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామంలో మంచినీటి ట్యాంకు నిర్మించాలని, త్రాగునీరు సౌకర్యం కల్పించాలని విన్నవించారు.

జి.మాడుగుల మండలం సొలభం పంచాయతీ సొలభం గ్రామానికి చెందిన ఎల్ రామకృష్ణ, మండల పీసా ఫోరం అధ్యక్షుడు గ్రామంలో సిసి రోడ్లు నిర్మించాలని కోరారు.

హుకుంపేట మండలం పట్టం పంచాయతీ పట్టం గ్రామానికి చెందిన వి. సింహాచలం వితంతు పెన్షన్ మంజూరు చేయాలని వినతి సమర్పించారు.

జి. మాడుగుల మండలం సొలభం పంచాయతీ ఏనుగు గొంది గ్రామానికి చెందిన సి.హెచ్ సురేష్ బాబు, అన్నదాత సుఖీభవ అమౌంట్ బ్యాంకు ఖాతాకు జమ కాలేదని వినతిపత్రం సమర్పించారు.

పెదబయలు మండలం పెదకోదాపల్లి పంచాయతీ ఆంధ్ర వర గ్రామానికి చెందిక పి. కిత్తన్న పీ యం జన్మన్ పథకం లో భాగంగా మంజూరై నిర్మించిన గృహానికి బిల్లులు మంజూరు చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్ బి ఎస్ నంద్, డిఆర్డిఎ పిడి వి మురళీ, జిల్లా భూగర్భ జల డిప్యూటీ డైరెక్టర్ డి. శ్రీనివాస్, జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి మోహన్, కాఫీ బోర్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎల్.బొంజి బాబు, జిల్లా గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుద్ధ్య శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.వి.వి. నాగేశ్వరరావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఆర్.వి. రమణా రావు, గ్రామ వార్డ్ సచివాలయ నోడల్ ఆఫీసర్ పి ఎస్ కుమార్, డిపివో కె.పి. చంద్ర శేఖర్, జిల్లా ఖజానా శాఖాధికారి ప్రసాద్ బాబు , డివిజనల్ డెవలప్మెంట్ అధికారి ఎ .జయప్రకాష్, జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ సిబ్బంది, జిల్లా ప్రణాళిక సిబ్బంది, పలువురు తాహాసిల్దార్లు తదితరులు ఉన్నారు.



01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## మొక్కజొన్న రైతులకు యూరియా సరఫరా



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, పొందూరు పిబ్రవరి 06 :** పొందూరు మండలం కనిమెట్ట గ్రామంలో యూరియా సరఫరా చేసారు. మొక్కజొన్న పంటను రైతులు అధికంగా వేయ్యడంతో బయట మార్కెట్ లో యూరియా అధిక ధరలకు లబిస్తుండటంతో కనిమెట్ట రైతు భరోసా కేంద్రం ద్వారా ప్రభుత్వం సబ్సిడీపై యూరియాను రైతులకు అందించారు. 230 యూరియా బస్తాలు రాగా ఈ మొత్తాన్ని రైతలకు, కౌలు రైతులకు భూమి యొక్క 1బి , ఆదార్ కార్డులు అదారంగా ఒకోక్క రైతుకు రెండు బస్తాలు చొప్పున సచివాలయం అగ్రికల్చరల్ అసిస్టెంట్ అందించారు. రైతు భరోసా కేంద్రంలో యూరియా అందించడంతో రైతులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## 66వ వార్డులో పరిసరాల పరిశుభ్రత ఆరోగ్యం పై అవగాహన కార్యక్రమం




**గాజువాక పెన్ పవర్, ఫిబ్రవరి 06:**జీవీఎంసీ 66వ వార్డ్ లో కుష్టి వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించటం జరిగింది,
. ప్రాంతాల్లో పరిశుభ్రతపై, ప్లాస్టిక్, వాడకాలపై విజ్ఞాన భారతి, శ్రీనివాస హై స్కూల్ స్టూడెంట్స్ కి టీచర్స్ కి పేరెంట్స్ తో డోక్రా గ్రూపు మహిళలతో కుష్టి వ్యాధి నివారణపై ఇది అంటువ్యాధి కాదు, అలాంటి వ్యాధి ఉన్న వారిని వారిపై ఎటువంటి ఆంక్షలు విధించొద్దు అంటూ, వివరించారు.కార్యక్రమం వార్డు అధ్యక్షుడు గోమడ వాసు, మాజీ కార్పొరేటర్ మహమ్మద్ రఫీ, సీనియర్ తెలుగుదేశం నాయకుడు వార్డు ట్రెజరర్, లక్కోజి లక్ష్మణరావు, వార్డు మైనార్టీ అధ్యక్షుడు, మహమ్మద్ భాష, స్కూలు టీచర్స్, ముఖ్యంగా వార్డులో ఏఎన్ఎంలు ఆధ్వర్యంలో ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించారు...


## క్రీడలతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకుందాం

- జర్నలిస్టులకు గాజువాక్ ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ అధ్యక్షుడు పితాని సూర్య ప్రసాద్ పిలుపు
- జర్నలిస్టులకు క్రీడా సామాగ్రి పంపిణీ



**గాజువాక: పెన్ పవర్, ఫిబ్రవరి 06**
నిత్యం ఒత్తిడిలో ఉండే జర్నలిస్టులకు శారీరక శ్రమ అవసరమని అందుకు క్రీడలే మార్గమని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ విశాఖ యూనిట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, గాజువాక యూనిట్ అధ్యక్షుడు, ఆజాద్ పత్రిక సంపదకుడు పితాని సూర్యప్రసాద్ అన్నారు. శుక్రవారం గాజువాకలో గాజువాక క్రికెట్ టీంకు ఆయన సమకూర్చిన క్రీడా సామాగ్రి ని స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జర్నలిస్టుల్లో ఐక్యతను పెంచేందుకు కూడా క్రీడలు దోహదం చేస్తాయని అన్నారు. కష్ట కాలంలో గాజువాక జర్నలిస్టులు అంతా ఒక్కతాటిపై నిలిచి ఐక్యతను చాటుకోవాలని పిలుపునిచ్చారు. గాజువాక రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన ప్రాంతంగా ఉందని పేర్కొన్నారు. గతంలో అనేకమంది ఆపదలో ఉన్న విలేకరులను ఆదుకున్న ఘనత ఇక్కడి జర్నలిస్టులకే చెందుతుందని వివరించారు. క్రీడా పరికరాలలో అవసరమైన షూస్ ను ఆయన అందజేయగా, వర్కింగ్ అండ్ ఫెడరేషన్ సెక్రటరీ నాయుడు క్యాప్స్ సమకూర్చి అందజేశారు. గాజువాక క్రికెట్ టీం కెప్టెన్ వసంత్ కు తొలుత పంపిణీ చేయగా అనంతరం జట్టు సభ్యులకు పరికరాలను అందజేయడం జరిగింది. గాజువాక జర్నలిస్టులు క్రీడాకారులు గులిమి రాజు, జగన్, సునీల్, ఫిరోజ్, ఖాజా, మూర్తి, వి. రాజు, బత్తిన రాజు, కర్రి నూకరాజు, నాగరాజు, వాసు, ప్రసాద్ తదితరులకు అందజేశారు.

## నడివీధి గ్రామంలో మంచినీటి కుళాయిలను ప్రారంభించిన సర్పంచ్



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 6:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం వంచుల పంచాయతీలోని నడివీధి గ్రామంలో స్థానిక సర్పంచ్ వనపల కాసులమ్మ చేతుల మీదుగా మంచినీటి కుళాయిలను ప్రారంభించారు. వేసవి ని దృష్టిలో పెట్టుకొని ప్రజలు ఎటువంటి ఇబ్బంది పడకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా మంచినీటి కుళాయిలు ప్రారంభించడం జరిగిందని ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యురాలు కృష్ణ వేణి నాయకులు వనపల రాజేష్,పోత్తూరు గంగరాజు,లొంజా గణపతి,భగవాన్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ ఉమెన్ విద్యార్థికి జాతీయ స్థాయిలో కాంస్య పతకం







**కూర్మన్నపాలెం పెన్ పవర్, ఫిబ్రవరి 06:**విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ ఉమెన్ కు చెందిన × బీ.టెక్ థర్డ్ ఇయర్ సి.ఎస్.ఇ -- ఏ విభాగం విద్యార్థిని కావ్య 70వ జూనియర్ జాతీయ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ 2025--26 లో కాంస్య పతకాన్ని సాధించింది.
బాల్ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జారీ చేసిన అధికారిక మెరిట్ సర్టిఫికేట్ ప్రకారం, కావ్య ఈ ప్రతిష్ఠాత్మక జాతీయ స్థాయి పోటీలో బాలురు మరియు బాలికల విభాగంలో మూడవ స్థానాన్ని 3వ స్థానం కైవసం చేసుకున్నారు. ఈ పోటీ తమిళనాడు రాష్ట్రంలోని ఎరోడ్‌లో ఉన్న ఎక్సెల్ గ్రూప్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో 2026 జనవరి 28 నుండి ఫిబ్రవరి 1 వరకు నిర్వహించారు.
దేశవ్యాప్తంగా ప్రతిభావంతులైన క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీలో కావ్య చూపిన అద్భుత ప్రదర్శన, కృషి మరియు క్రీడాస్ఫూర్తి ద్వారా సంస్థకు జాతీయ స్థాయిలో గౌరవాన్ని తీసుకువచ్చారు.
విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ ఉమెన్ ప్రిన్సిపల్ డా. బి. అరుంధతి కావ్యను అభినందించారు. కఠిన శ్రమ, క్రమశిక్షణ మరియు క్రీడల పట్ల ఉన్న నిబద్ధతను ప్రశంసించారు. విద్యార్థులు విద్యా రంగంలోనే కాకుండా క్రీడలు మరియు సహపాఠ్య కార్యక్రమాలలో కూడా రాణించేందుకు సంస్థ ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని అన్నారు.
విజ్ఞాన్ యాజమాన్యం, అధ్యాపకులు మరియు విద్యార్థులు కావ్య సాధనపై అపార ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, ఆమె భవిష్యత్తు క్రీడా మరియు విద్యా ప్రయాణాలకు శుభాకాంక్షలు తెలిపారు.

## 92వ వార్డ్ నందమూరి నగర్లో బీటీ రోడ్లకు శంకుస్థాపన





**రూ.37.52 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులకు శ్రీకారం**

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, ఫిబ్రవరి 6 :** నందమూరినగరంలోని 92వ వార్డ్‌లో మౌలిక వసతుల అభివృద్ధి దిశగా మరో కీలక అడుగు పడింది. మన ప్రియతమ నాయకులు, ప్రభుత్వ విప్ మరియు పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ఆదేశాల మేరకు, సుమారు రూ.37.52 లక్షల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్లకు శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇంచార్జ్ దాడి.రమేష్ నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ లక్ష్యమని తెలిపారు.
రోడ్ల నిర్మాణం పూర్తయితే స్థానిక ప్రజలకు రాకపోకలు మరింత సులభమవుతాయని, వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తొలగిపోతాయని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు కంపర ఆనంద్, మహిళా నాయకురాలు మంగలక్ష్మి, అలాగే గొల్లవిల్లి శ్రీను, తాతబాబు, సతీష్, వీర్రాజు, శంకర్, కూటమి గొంతిన శ్రీను తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నాయకులు అందరూ ఎమ్మెల్యే గణబాబు నాయకత్వాన్ని ప్రశంసిస్తూ, ఆయన సూచనలతోనే వార్డ్‌లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. స్థానిక ప్రజలు కూడా ఈ రోడ్ల నిర్మాణానికి హర్షం వ్యక్తం చేస్తూ, పాలకులపై కృతజ్ఞతలు తెలిపారు.
ఈ బీటీ రోడ్ల నిర్మాణంతో 92వ వార్డ్, నందమూరి నగర్లో మౌలిక వసతులు మరింత బలోపేతం కానున్నాయని, అభివృద్ధి పథంలో మరో ముందడుగు పడినట్టేనని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## రహదారి భద్రతపై పోలీసుల కఠిన చర్యలు

- రోడ్డు మీద నిర్లక్ష్యం వద్దు: ఎస్సై హెచ్చరిక



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఫిబ్రవరి6:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలంలోని పెదవలస గ్రామం మరియు గూడెం కొత్తవీధిలో జీకే వీధి ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.ఈ సందర్భంగా వాహనదారులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని ఎస్సై సురేష్ సూచించారు. అలాగే వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని తెలిపారు. హెల్మెట్ ధరించకుండా లేదా అధిక వేగంతో వాహనాలు నడిపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
ఈ ప్రత్యేక డ్రైవ్ ద్వారా రహదారి ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యమని ఎస్సై సురేష్ పేర్కొన్నారు.

## లీడర్ టు క్యాడర్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ గణబాబు



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, ఫిబ్రవరి 6 :** విజయవాడలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో ఈ రోజు తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్టేట్ టూ బూత్, లీడర్ టు క్యాడర్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా టిడిపి క్యాడర్ మరియు పార్టీ నాయకులకు శిక్షణ తరగతులు నిర్వహించగా, వాటిలో ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలే మూలస్తంభాలని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి విధానాలు, సంక్షేమ కార్యక్రమాలు నేరుగా ప్రజల వరకు చేరాలంటే క్యాడర్ చురుకుగా పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు.
స్టేట్ టూ బూత్ కార్యక్రమం ద్వారా పార్టీ ఆలోచనా విధానం, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలతో అనుసంధానం మరింత బలపడుతుందని వివరించారు. అలాగే లీడర్ టు క్యాడర్ కార్యక్రమం ద్వారా నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం పెరుగుతుందని, ప్రతి కార్యకర్త పార్టీకి రాయబారిగా మారాలని సూచించారు. రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై మరింత దృష్టి సారిస్తూ, ప్రభుత్వ పథకాలను ప్రజలకు స్పష్టంగా వివరించే బాధ్యత టిడిపి క్యాడర్‌పై ఉందని గణబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ నాయకులు, మండల స్థాయి నాయకులు, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శిక్షణ తరగతులు క్యాడర్‌లో ఉత్సాహాన్ని నింపాయని, పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ఈ కార్యక్రమం కీలకంగా నిలుస్తుందని నాయకులు అభిప్రాయపడ్డారు.

## పెందుర్తిలో పార్టీ సంస్థాగత నిర్మాణానికి ఊపిరిపోసిన నేతలు





**గ్రామ పార్టీ కమిటీల సమావేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్**

**పెందుర్తి, పెన్ పవర్, ఫిబ్రవరి 6 :** స్థానిక పెందుర్తి మండలంలోని రాజయ్యపేట, వాలిమేరక పంచాయతీ పరిధిలో గ్రామ పార్టీ కమిటీలు మరియు అనుబంధ విభాగాల కమిటీల సంస్థాగత నిర్మాణ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో పెందుర్తి మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్ రాజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నంరెడ్డి అదీప్ రాజ్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి గ్రామస్థాయి నుంచి బలమైన కమిటీల నిర్మాణమే పునాదని అన్నారు. కార్యకర్తల సమిష్టి కృషితోనే ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవచ్చని, రానున్న రాజకీయ సవాళ్లను ధీటుగా ఎదుర్కొనాలంటే ప్రతి కార్యకర్త పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. గ్రామ పార్టీ కమిటీలు ప్రజలకు అందుబాటులో ఉండి, సమస్యల పరిష్కారంలో ముందుండాలని ఆయన పిలుపునిచ్చారు.
ఈ సమావేశంలో సీనియర్ నాయకులు ఉప్పిలి కనకరాజు, మండల పార్టీ అధ్యక్షులు గోరపల్లి శ్రీను, బొడ్డు ప్రకాశ్, ఉగ్గిన నాగార్జున, దిలీప్, ముప్పల శ్రీను, శ్రీను, సాయిరాం పాత్రుడు, పైలా సూరిబాబు, పుచ్చ బంగారు బాబు, దుందు సన్యాసి రాజు తదితర ముఖ్య నాయకులు పాల్గొని పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. నాయకులు మాట్లాడుతూ, పార్టీ చేపట్టే కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేరవేయాల్సిన బాధ్యత కార్యకర్తలదేనని, గ్రామస్థాయిలో ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని అన్నారు. సంస్థాగత నిర్మాణం ద్వారా పార్టీ మరింత బలపడుతుందని, రాబోయే ఎన్నికల్లో ఘన విజయం సాధించే దిశగా అందరూ సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేశారు.

## 12న దేశ వ్యాప్త కార్మికుల సమ్మెను జయప్రదం చేయండి

**కార్మికుల హక్కులు చట్టాలు నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం.**

**మండల సిఐటియు కార్యదర్శి కొర్ర శంకర్రావు.**

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఫిబ్రవరి 06.**ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సమ్మెలో పాల్గొని అంగన్వాడి కార్యకర్తలు జయప్రదం చేయాలని మండల సిఐటియు కార్యదర్శి కొర్ర శంకర్రావు పిలుపు నిచ్చారు. శుక్రవారం మండలంలో గల అంగన్వాడి కార్యకర్తలతో భేటీలో ఆయన మాట్లాడుతూ.. కార్మికుల హక్కులు 29 చట్టాలు పటిష్టంగా అమలు చేయాలని, కార్మిక సంఘాల గొంతు నొక్కే నాలుగు నల్ల చట్టాలను వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు చేయాలని ఆయన అన్నారు. కార్మికులకు అనుకూలమైన చట్టాలు అమలు చేయాలని, కనీస వేతనం చెల్లించాలన్నారు. ఉపాధి హామీ చట్టాలు నిర్వీర్యం చేస్తే సహించేది లేదని, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను సిఐటియు తీవ్రంగా ఖండిస్తుందన్నారు. కార్మికులకు గుర్తింపు, కనీస వేతనం చట్టబద్ధమైన సౌకర్యాలపై ఫిబ్రవరి 12న జరుగుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నేతలు పాంగి భీమరాజు, గణపతి, మండల అంగన్వాడి యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు వి గంగ భవాని, ఎస్ ఈశ్వరి, కె అమ్మాజీ, అంగన్వాడీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ఎస్పీ సంపర్క్ కార్యక్రమం



ఫోన్-ఇన్ కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా


**అనకాపల్లి, పెన్ పవర్, ఫిబ్రవరి 6 :** పోలీస్ శాఖలో పనిచేస్తున్న సిబ్బంది సంక్షేమమే అత్యంత ప్రాధాన్యమని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా స్పష్టం చేశారు. డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం "ఎస్పీ సంపర్క్" ఫోన్-ఇన్ కార్యక్రమాన్ని ఎస్పీ స్వయంగా ప్రారంభించారు. పోలీస్ శాఖలో ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి సిబ్బందికి మధ్య ఉన్న అంతరాన్ని తొలగించి, సిబ్బంది తమ సమస్యలను ఎటువంటి భయం లేదా సంకోచం లేకుండా నేరుగా జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకువచ్చేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమం ప్రారంభమైన తొలి రోజే జిల్లావ్యాప్తంగా వివిధ హోదాల్లో పనిచేస్తున్న 27 మంది పోలీస్ సిబ్బంది 9346912011 నంబర్‌కు ఫోన్ చేసి ఎస్పీతో నేరుగా మాట్లాడారు.

సిబ్బంది తమ పోస్టింగ్స్, బదిలీలు, సెలవులు, సర్వీస్ సంబంధిత అంశాలు, ఆరోగ్య సమస్యలు, కుటుంబ ఇబ్బందులు, పనిభారం మరియు మానసిక ఒత్తిడి వంటి సమస్యలను ఎస్పీ గారి దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి అంశాన్ని శ్రద్ధగా విన్న ఎస్పీ, సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు తక్షణమే ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ "కానిస్టేబుల్స్ నుంచి హోమ్ గార్డ్స్ వరకు ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు వెన్నెముక వంటివారు, వారి సమస్యలను గోప్యంగా ఉంచుతూ, త్వరితగతిన పరిష్కరించడమే ఎస్పీ సంపర్క్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం.

దూర ప్రాంతాల నుంచి జిల్లా కార్యాలయానికి రావాల్సిన అవసరం లేకుండా నేరుగా ఫోన్ ద్వారా నాతో మాట్లాడవచ్చు" అని తెలిపారు.

ప్రతి శుక్రవారం ఉదయం 11.00 గంటల నుంచి 12.00 గంటల వరకు ఈ ఫోన్-ఇన్ కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతుందని ఎస్పీ తెలిపారు. డీజీపీ ఆదేశాల ప్రకారం, ఈ కార్యక్రమం ద్వారా వచ్చే ప్రతి ఫిర్యాదును ప్రత్యేక రిజిస్టర్ లేదా డిజిటల్ లాగ్‌లో నమోదు చేసి, నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఏవో సిహెచ్.తిలక్ బాబు, ఎస్సై ప్రసాద్, ఆఫీస్ సూపర్డెంట్లు గిరి, దేవరాజు తదితర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. పోలీస్ శాఖలో సిబ్బంది సంక్షేమానికి ఈ "ఎస్పీ సంపర్క్" కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని పలువురు సిబ్బంది అభిప్రాయం వ్యక్తం చేశారు.



## మారుమూల గ్రామాలను సందర్శించిన తహాశీల్దార్

గిరిజనుల నుంచి పలు వినతులు స్వీకరణ





**కొయ్యూరు, పెన్ పవర్ ఫిబ్రవరి 6:** మండలంలోని అతి మారుమూలనున్న మఠం భీమవరం పంచాయతీని సందర్శించిన కొయ్యూరు తాసిల్దార్ మురళీ బాబు. గురువారం డిఆర్ డిపోలో రేషన్ సరుకులు సక్రమంగా అందించాలని సేల్స్ మేన్ లకు ఆదేశించారు. అలాగే పుట్టకోట, పి ఎల్ కొత్తూరు గ్రామాలను సందర్శించి గ్రామాల్లో జరిగిన రీ సర్వే అయినా రైతులకు పాస్ పుస్తకాలను మార్చి నెలలో వెరిఫికేషన్ చేసి అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే మా గ్రామాలకు రహదారి నిర్మించాలని వినతులు స్వీకరించారు. అనంతరం పిఎల్ కొత్తూరులో ఏర్పాటుచేసిన ఆధార్ సెంటర్ ను తనిఖీ చేసి, ఆధార్ సెంటర్ ను ప్రజలంతా సద్వినియోగం చేసుకొని పిల్లలకు తప్పనిసరిగా ఆధార్ నమోదు చేయాలని తల్లిదండ్రులకు ఆయన కోరారు. అలాగే యు చీడిపాలెం సచివాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు ఉద్యోగులు క్రమం తప్పకుండా విధులకు హాజర అవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో శ్యామ్, విలేజ్ సర్వేయర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన...!



**కొయ్యూరు, పెన్ పవర్ ఫిబ్రవరి 6:**పీఎం--ఉషా పథకం లో భాగంగా, మర్రిపాలెం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినుల కోసం సైబర్ సెక్యూరిటీపై ఐదు రోజుల వర్క్‌షాప్ సోమవారం ప్రారంభమై, శుక్రవారం నాడు విజయవంతంగా ముగిసింది. ఈ వర్క్‌షాప్‌ను పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా. వి. చిట్టబ్బాయి ఆధ్వర్యంలో నిర్వహించారు. శు క్రవారం

ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కె. సుధ మాట్లాడుతూ... నేటి డిజిటల్ యుగంలో సైబర్ సెక్యూరిటీపై అవగాహన ప్రతి విద్యార్థినికి అత్యంత అవసరమని అన్నారు. ఈ వర్క్‌షాప్‌ను విద్యార్థినులు సద్వినియోగం చేసుకొని నూతన సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకున్నారని తెలిపారు. భవిష్యత్‌లో మెరుగైన ఉపాధి అవకాశాలను పొందేందుకు ఈ తరహా శిక్షణ కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని ఆమె పేర్కొన్నారు.

ఈ వర్క్‌షాప్‌కు కోఆర్డినేటర్‌గా కామర్స్ లెక్చరర్ బోండ్ల శేఖర్ వ్యవహరించగా, కంప్యూటర్ ట్రైనర్ సుర్ర శరత్ బాబు సైబర్ సెక్యూరిటీకి సంబంధించిన వివిధ అంశాలపై శిక్షణ అందించారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, డేటా భద్రత, సోషల్ మీడియా భద్రత, సైబర్ ప్రమాదాలు, వాటి నివారణ చర్యలపై విద్యార్థినులకు విస్తృత అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొని విద్యార్థినులను ప్రోత్సహించారు. ఐదు రోజుల పాటు నిర్వహించిన ఈ వర్క్‌షాప్ ద్వారా విద్యార్థినుల్లో సాంకేతిక నైపుణ్యాలు, డిజిటల్ భద్రతపై అవగాహన మరింత పెరిగిందని నిర్వాహకులు తెలిపారు.

## జర్నలిస్టుల క్రికెట్ పోటీలు ప్రారంభించిన విశాఖ ఫార్మాసిటీ ప్రతినిధులు రాఘవరెడ్డి, మాధవ్.






ముఖ్యఅతిథిగా పాల్గొన్న వెయిట్ లిఫ్టర్ పూజారి శైలజ.

**పరవాడ(పెన్ పవర్): ఫిబ్రవరి 6:** రాంకీ ఫౌండేషన్, పరవాడ జర్నలిస్ట్ స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఫార్మాసిటీ క్రీడా మైదానంలో ఏర్పాటుచేసిన ఉమ్మడి విశాఖ జిల్లాల జర్నలిస్టుల క్రికెట్ పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 8 జట్లు పాల్గొనబోయే క్రికెట్ పోటీలను విశాఖ ఫార్మాసిటీ లైజనింగ్ డిజిఎం రాఘవరెడ్డి, ఆపరేషన్స్ జనరల్ మేనేజర్ మాధవ్ ముఖ్య అతిథులుగా పాల్గొని రిబ్బన్ కత్తిరించి పోటీలు ప్రారంభించారు. జర్నలిస్టు క్రికెట్ క్రీడాకారులతో కాసేపు అతిథులు క్రికెట్ ఆడారు. అనంతరం జర్నలిస్ట్ క్రికెట్ క్రీడాకారులను ఉద్దేశించి ముఖ్య అతిథులు మాట్లాడుతూ నిత్యం వార్తల సేకరణలో సతమతమయ్యే జర్నలిస్టులకు ఈ క్రికెట్ పోటీలు కొంత ఆటవిడుపుగా ఉంటాయని అన్నారు. ప్రతి జట్టు క్రీడాకారులు ఈ పోటీల్లో క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని ఆకాంక్షించారు. పోటీల్లో పాల్గొనబోయే క్రీడాకారులకు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రముఖ వెయిట్ లిఫ్టర్ అనకాపల్లి స్పోర్ట్స్ అథారిటీ అధికారిని శ్రీమతి పూజారి శైలజ క్రికెట్ పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రికెట్ పోటీలతోపాటు వెయిట్ లిఫ్టింగ్ పోటీలను కూడా విశాఖ ఫార్మాసిటీ ప్రతినిధులు ప్రోత్సహించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ పోటీలను ప్రతి సంవత్సరం విజయవంతంగా నిర్వహిస్తున్న రామ్కీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ శ్రీకాంత్ ని, ఫౌండేషన్ సిబ్బందిని ఈ సందర్భంగా ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఫార్మాసిటీ ప్రతినిధులు భరత్ ,మూర్తి, పరవాడ జర్నలిస్టు స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్. లోకేష్, ఎండి రాజు, గాజువాక ,అనకాపల్లి ,వైజాగ్, పరవాడ ప్రాంతాల నుండి వచ్చిన జర్నలిస్టు క్రికెట్ క్రీడాకారులు, రామ్కీ ఫౌండేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## జన్ మన్ గృహాలకు శంకుస్థాపన...!




పి వి టి జి గృహాలకు శంకుస్థాపన చేసిన ఎంపీడీవో

**కొయ్యూరు, పెన్ పవర్ ఫిబ్రవరి 6 :** మండలంలోని మూలపేట పంచాయితీ కొండసంతలో పివిటిజి 12 గృహాలకు శంకుస్థాపన చేపట్టిన ఎంపీడీవో జీడివి ప్రసాద్ రావు. శుక్రవారం ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రసాదరావు మాట్లాడుతూ... కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా జన్ మన్ కార్యక్రమం ద్వారా పివిటిజీలకు ఎంతగానో ఆదుకుంటుందని దీనిని మీరు సద్వినియోగం చేసుకొని త్వరితగతిన గృహాలు నిర్మించుకుంటే వెంటవెంటనే పేమెంట్లు సంబంధిత అధికారులు చెల్లిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మూలపేట సర్పంచ్ రావుల వెంకటలక్ష్మి, హౌసింగ్ ఏఈ ఉమా మహేష్, వర్క్ ఇన్స్పెక్టర్లు గిరీశం, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

## దుప్పులవాడ పంచాయతీలో ఘనంగా గ్రౌండింగ్ మేళా!



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 6:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం దుప్పులవాడ పంచాయతీ అగ్రహారం గ్రామంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వం మంజూరు చేసిన గృహాల నిర్మాణానికి సంబంధించి గురువారం ఘనంగా గ్రౌండింగ్ మేళ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ బోయిన కుమారి హాజరై కొబ్బరికాయ కొట్టి గ్రౌండింగ్ మేళను ప్రాశ్రీరంభించారు. గృహ నిర్మాణ శాఖ ఏఈ లక్ష్మీ విమల, స్థానిక సర్పంచ్ కేలేబు కుమారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడిన వారు ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని, గృహ నిర్మాణాన్ని నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్లు సెగ్గే సూరిబాబు, పి. చిట్టి పడాల్, పంచాయితీ సెక్రెటరీ శివాజీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కుసుమ, కూటమి నాయకులు మన్మధరావు, టోక్కు బాబు, గ్రామ పెద్దలు అల్లంకి రాజు, సోన్ను, గోపాలరావు, శేఖర్, లక్ష్మణ్‌తో పాటు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం చేయండి... ప్రాణదాతలు కండి

నరవలో మెగా రక్తదాన శిబిరం 71 యూనిట్ల రక్త సేకరణ




**పెందుర్తి, పెన్ పవర్, ఫిబ్రవరి 6 :** స్థానిక పెందుర్తి మండలం, నరవ, బెహరా విద్యాసంస్థల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరం విజయవంతంగా ముగిసిందని బెహరా విద్యాసంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ బాణాల తరుణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి ఎంతో అవసరమైన రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. బెహరా విద్యాసంస్థల సెక్రటరీ డా.చైతన్య ఆదేశాల మేరకు, స్టీల్ సిటీ లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వారి సౌజన్యంతో ఈ మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. ఈ శిబిరంలో సుమారు 100 మందికి పైగా విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొనగా, మొత్తం 71 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

ఈ సందర్భంగా మాట్లాడిన వక్తలు, రక్తదానం చేయడం ద్వారా మరొకరికి ప్రాణదానం చేసిన వారమవుతామని, ఆరోగ్యవంతులు ప్రతి ఆరు నెలలకు ఒకసారి మాత్రమే రక్తదానం చేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన రోగులకు ఈ రక్తదానం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. యువత రక్తదానం వంటి సేవా కార్యక్రమాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్టీల్ సిటీ లైన్స్ క్లబ్ బ్లడ్ బ్యాంక్ కోఆర్డినేటర్ మంత్రి జగన్నాథరావు, కళాశాలల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ గోవిందరాజు, కామేష్ కుమార్, కామేశ్వరరావు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. రక్తదానం చేసిన విద్యార్థులను నిర్వాహకులు అభినందించారు.

## చౌకధరల దుకాణాలపై అధికారుల తనిఖీలు

కార్డుదారులకు ఐవీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్‌పై అవగాహన



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 6:**గూడెం కొత్తవీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ పరిధిలోని చెరుకుమల్లు గ్రామంలో బుధవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ విచారణలో తహసీల్దార్ హెచ్ అన్నాజీ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తుల నుంచి అందిన ఫిర్యాదులను పరిశీలించి, క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టారు.అనంతరం సప్పర్ల, కొంగపాకలు గ్రామాల్లోని ప్రభుత్వ చౌకధరల దుకాణాలను అధికారులు సందర్శించారు. అక్కడ పంపిణీ అవుతున్న రేషన్ సరుకుల నాణ్యత, తూకం విధానం, సరుకుల పంపిణీ ప్రక్రియలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కార్డుదారులతో ముఖాముఖి సమావేశం నిర్వహించి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఐవీఆర్ఎస్ (ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్) ఫీడ్‌బ్యాక్ విధానంపై కార్డుదారులకు అధికారులు అవగాహన కల్పించారు. రేషన్ సరుకుల పంపిణీ సక్రమంగా జరుగుతోందా, తూకంలో ఎలాంటి తేడాలు ఉన్నాయా, డీలర్ల ప్రవర్తన ఎలా ఉందన్న అంశాలపై ఫోన్ కాల్స్ ద్వారా అభిప్రాయాలు తెలియజేయాలని సూచించారు. భయపడకుండా నిజమైన సమాచారం ఇవ్వాలని కోరారు.ప్రజల నుంచి వచ్చే ఫీడ్‌బ్యాక్ ద్వారా పారదర్శక పాలన సాధ్యమవుతుందని, చౌకధరల దుకాణాల వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడంలో ఇది కీలకపాత్ర పోషిస్తుందని అధికారులు తెలిపారు.

## విశాఖ అడవుల్లో జాతీయ భద్రతా దళం విన్యాసం

- బలోపేతమైన అంతర విభాగ భద్రతా సమన్వయం



**విశాఖ దక్షిణం,పెన్ పవర్, ఫిబ్రవరి 05 :**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నం పరిసర అటవీ ప్రాంతాల్లో జాతీయ భద్రతా దళం నేషనల్ సెక్యూరిటీ గార్డ్ -- ఎన్ఎస్జీ ఆధ్వర్యంలో అడ విలో బందీల విముక్తి ఆపరేషన్ విన్యాసం ను విజయవంతంగా నిర్వహించారు. ఫిబ్రవరి 02 నుంచి 05 వరకు కొనసాగిన ఈ విన్యాసం, వాస్తవ యుద్ధ పరిస్థితులను ప్రతిబింబించేలా రూపొందించారు.నక్సల్స్ ప్రస్తుత కార్యకలాప విధానాలను దృష్టిలో పెట్టుకొని, అడవుల్లో ఎదురయ్యే సవాళ్లకు అనుగుణంగా ఆపరేషన్ నైపుణ్యాలు, వ్యూహాలు, తంత్రాలపై తీవ్ర సాధన చేపట్టారు. అత్యంత యథార్థ శిక్షణ వాతావరణంలో నిర్వహించిన ఈ విన్యాసం ద్వారా సంభవించే ముప్పులను ముందుగానే అంచనా వేసి సమర్థంగా ఎదుర్కొనే లక్ష్యాన్ని సాధించారు.ఈ విన్యాసంలో ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖతో పాటు గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాలు ప్రథమ స్పందన దళాలుగా పాల్గొన్నారు. కేంద్ర రిజర్వ్ పోలీస్ దళం, ఇండో--టిబెటన్ సరిహద్దు పోలీస్ దళం, రాష్ట్ర విపత్తు స్పందన దళం, అటవీ శాఖ, అగ్నిమాపక శాఖ, వైద్య విభాగా లు, గూఢచారి సంస్థలు కీలక మద్దతు అందిం చాయి. అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన, ప్రభావవంతమైన స్పందనకు అంతర విభాగ సమన్వయం ఎంత ముఖ్యమో ఈ విన్యాసం స్పష్టంగా చూపించింది.


ఈ విన్యాసంలో ప్రధానంగా

బందీలను సురక్షితంగా విడుదల చేసే ఆపరేష న్లు,తాత్కాలికంగా తయారు చేసిన పేలుడు పరికరాలను నిర్వీర్యం చేసే విధానాలు,అడవి యుద్ధ తంత్రాలపై ప్రత్యేక శిక్షణ,అంశాలపై దృష్టి సారించారు.విన్యాసం పూర్తైన అనంతరం, అడవిలో బందీల విముక్తి పరిస్థితుల్లో ఉపయో గించే ఆధునిక ఆయుధాలు, పరికరాల ప్రదర్శన ను ఏర్పాటు చేసి, వాటి వినియోగంపై అవగా హన కల్పించారు.ఈ సందర్భంగా గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్ (ఆపరేషన్లు) డాక్టర్ సుమిత్ గరుడ్, భారత పోలీస్ సేవాధికారి మాట్లాడు తూ, జాతీయ భద్రతా దళం చేపట్టిన సమన్వ యపూర్వక ప్రయత్నాలను ప్రశంసించారు. ఈ విన్యాసం ద్వారా జాతీయ భద్రతా దళం మరి యు రాష్ట్ర పోలీస్ బలగాల మధ్య సమన్వ యం మరింత బలోపేతమై, వాస్తవ కాల ము ప్పులను ఎదుర్కొనే సమగ్ర స్పందన వ్యవస్థ ఏర్పడిందని తెలిపారు.ఇలాంటి విన్యాసాలు భద్రతా బలగాల ఆపరేషనల్ సిద్ధతను పెంపొందించడమే కాకుండా, కీలక సందర్భాల్లో వేగవంతమైన మరియు సమగ్ర నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని మెరుగుపరుస్తాయని జాతీయ భద్రతా దళం పేర్కొంది.

ఈ విన్యాసం ద్వారా జాతీయ భద్రతా దళం, గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాల మధ్య సహకారం గణనీయంగా బలపడిందని, నక్సల్స్ లేదా ఉగ్రవాదానికి సంబంధించిన అత్యవసర పరిస్థి తుల్లో ప్రజల భద్రతను కాపాడడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు విశ్వాసం వ్యక్తం చేశారు.

## తూర్పులో పలు వార్డులలో అభివృద్ధి కార్యక్రమాలు

- 13వ వార్డులో 77లక్షల15 వేలు రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన: ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు



**విశాఖ తూర్పు,పెన్ పవర్, ఫిబ్రవరి 6:** కూటమి ప్రభుత్వంలో తూర్పు నియోజకవర్గ పరిధిలో సర్వేకు గా అభివృద్ధి చెందిన పలు వార్డులు, జీవీఎంసీ నిధులతో కోట్ల రూపాయలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమాలు గతకొద్ది కాలముగా నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు ఆధ్వర్యంలో శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దానిలో భాగంగా 13వ వార్డు శివశంకర్ నగర్ లక్ష్మీపార్వతి నగర్ వెన్ను దుర్గా నగర్ సిద్ధార్థ నగర్లో 77 లక్షల 15 వేల రూపాయలతో కాలువలు సిసి రోడ్లు కల్వర్టుల పనులకు శంకుస్థాపన శుక్రవారం ఎమ్మెల్యే, వార్డు కార్పొరేటర్ కెల్లా సునీత సత్యనారాయణ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పనులను వెంటనే ప్రారంభించి సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఇ ఈ గంగాధర్, డి ఈ చంద్రమౌళి,వార్డు టీడీపీ అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు,విశాఖ పార్లమెంట్ కమిటీ అధికార ప్రతినిధి పొత్రకండ ధర్మారావు, వార్డు ప్రధాన కార్యదర్శి తురకపూడి బాలస్వామి,వార్డు ఉపాధ్యక్షులు మారిక జక్కన్న, కిల్లంశెట్టి శ్రీనివాస్, వడిసెల శ్రీను, యల్లమిల్లి సురేష్ రుత్తల వెంకట్రావు, షేక్ ఖాదర్ భాషా,ఓశెట్టి గురుమూర్తి శ్రీనివాస్, నెల్లి అప్పారావు, కనకల శ్రీను, కల్లూరి వెంకటేష్, మహాపాత్రో గోపికృష్ణ, చింతలపూడి నాగేశ్వరరావు,షేక్ పీరుబాబు,సూరిశెట్టి శ్రీనివాస్, టంకాల కేశవరావు, కర్రి మణి,గంటా దేవి, అనకాపల్లి రామలక్ష్మి, పోతల కృష్ణమ్మ, కుర్రి లక్ష్మి,షేక్ లాలుబోనెల కుమారి, తురకపూడి మోహన్ కృష్ణ, గురజాపు వాసు,రెడ్డి సత్తిరాజ తదితరులు పాల్గొన్నారు.

## చింతపండుకు జిసిసి గిట్టుబాటు ధర కల్పించాలి.



**గుమ్మలక్ష్మీపురం ఫిబ్రవరి 06 పెన్ పవర్.**ఏజెన్సీలో పండే పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించండి ఆదివాసి గిరిజన సంఘం అధ్యక్షుడు పువ్వల శ్రీను పిలుపునిచ్చారు.శు క్రవారం నాడు జిసిసి మేనేజర్ రాము ఆధ్వర్యంలో చాపరాయి బిన్నిడి పంచాయితీ,మూల బినిడి గ్రామంలో చింత పండు కొనుగోలు పై అవగాహన కల్పించేందుకు సిబ్బంది వెళ్లారు.జిసిసి కిలో 36 రూపాయలుకు కొనుగోలు చేస్తుందని మేనేజర్ రాము తెలపగ,ఈ మేరకు గిరిజన సంఘ అధ్యక్షులు పువ్వల శ్రీను మాట్లాడుతూ.గిరిజన ప్రాంతంలో సీజనల్ వారిగా పండే ప్రతి పంటలను జిసిసి గిట్టుబాటు ధరలకు కొనాలని ప్రస్తుతం ఉన్న చింతపండును ప్రైవేట్ దళారులు 50 రూపాయలకు కొనుగోలు చేస్తున్నారు దానికి అనుగుణంగా జీసీసీ కూడా అదే విధంగా కొనుగోలు చేస్తే దళారుల చేతిలో మోసపోకుండా జిసిసి కొనుగోలు కేంద్రానికి తీసుకొస్తామని శ్రీను గిరిజనుల తరఫున అన్నారు ఈ కార్యక్రమంలో జిసిసి డిపో సేల్స్ మిల్లు గిరిజన సంఘ నాయకులు పాల్గొన్నారు.

# బిజెపిలోకి భారీగా చేరికలు...!





**కొయ్యూరు, పెన్ పవర్ ఫిబ్రవరి 6 :**ప్రధాని నరేంద్ర మోడీ భారతదేశాన్ని విశ్వ విజేతగా తీర్చి దిద్దుతుండటంతో ఆకర్షితులైన ప్రజానికం భారీగా పార్టీలో చేరుతున్నట్లు బిజెపి అల్లూరి జిల్లా అధ్యక్షురాలు శాంతకుమారి పేర్కొన్నారు. మండలంలోని కినపర్తి పంచాయతీ గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు శివకుమార్ అధ్యక్షతన బిజెపి మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ వార్డు సభ్యుడు సుర్ల మణికంఠ కోన మహేష్ సుర్ల మల్లేశ్వరరావు నూకరాజు దుర్గాప్రసాద్ తో పాటు పంచాయతీకి చెందిన సుమారు 50 మందికి పైబడి వైసిపి కార్యకర్తలు బిజెపి లో చేరారు. వారందరికీ అధ్యక్షురాలు శాంతకుమారి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ...భారతీయ జనతా పార్టీ మహిళలకు అధిక ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. అందుకు నిదర్శనమే ఎక్కడో మారుమూల ప్రాంతంలో ఉన్న గిరిజన మహిళ ద్రౌపది ముర్మును రాష్ట్రపతిని చేయటమని, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా నిర్మల సీతారామన్ నియమించడం మంత్రివర్గంతో పాటు అనేక పదవుల్లో పురుషులతో సమానంగా మహిళలకు అవకాశాలను కల్పించడం ప్రధాని మోదీకే సాధ్యమన్నారు. మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరి పైన ఉందన్నారు. ప్రజలచే పార్లమెంటు సభ్యులుగా ఎన్నుకోబడిన అభ్యర్థులకు మాత్రమే పార్లమెంట్లో కూర్చునే అవకాశం ఉంటుందని అలాంటిది దేశవ్యాప్తంగా గిరిజన ప్రాంతాల్లో సర్పంచులుగా ఎన్నికైన సుమారు 500 మంది గిరిజన సర్పంచులతో రాష్ట్రపతి ప్రత్యేక సమావేశాన్ని పార్లమెంట్ వేదిక నిర్వహించడం అభినందనీయమని ఇటువంటి మహత్తర కార్యక్రమాలు బిజెపికి మాత్రమే సాధ్యమన్నారు. గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షులు అరకు నియోజకవర్గ ఇన్చార్జి పాంగి రాజారావు మాట్లాడుతూ క్రమశిక్షణ నిబద్ధత కలిగిన పార్టీ భారతీయ జనతా పార్టీ అని కొనియాడారు. ఎన్నికల సమయంలో చుట్టం చూపుగా ఎన్నో పార్టీల వారు ఎందరో నేతలు గ్రామాలకు వచ్చి హామీలు గుప్పిస్తారని ఎన్నికల అనంతరం తిరిగి 5 ఏళ్లదాకా అటువంటి వారు ఎక్కడా కానరారన్నారు. అలాంటి నాయకులు కావాలా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న నాయకత్వం కావాలా ప్రజలే గ్రహించాలన్నారు. బిజెపి సిద్ధాంతాలను వచ్చి ప్రధాని నరేంద్ర మోడీ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై తినపర్తి పంచాయతీ పరిధి పలు గ్రామాలకు చెందిన అధిక సంఖ్యలో వైసీపీ కార్యకర్తలు బిజెపిలో చేరటం ఆనందంగా బిజెపి రాష్ట్ర కార్యదర్శి స్వప్న కుమారి, గిరిజన మోర్చా అల్లూరి జిల్లా అధ్యక్షుడు అబ్బాయి దొర, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మత్స్య కొండబాబు పేర్కొన్నారు. ఇతర పార్టీలకంటే భిన్నంగా బిజెపిలో కష్టపడి పనిచేసే వారికి సముచిత స్థానాన్ని తగిన గుర్తింపును పార్టీ అధిష్టానం ఇస్తుందని, అందుకు నిదర్శనం తానేనని పాడేరు ఎఎంసి చైర్పర్సన్ మచ్చల మంగతల్లి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా నేత కేజియా రాణి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి అచ్యుత్, కొయ్యూరు మండల ప్రధాన కార్యదర్శులు పద్మరాజు సన్యాసిరావు, మాజీ మండలాధ్యక్షుడు ఎం అప్పలరాజు, ధార్మిక సంస్థల సేవా ప్రతినిధి డివిడి ప్రసాద్, గూడెం మండల మాజీ అధ్యక్షుడు చిరంజీవి, ఆర్టిఐ జిల్లా నేత అర్జున్ రెడ్డి, ఎస్ ఎస్ ఎఫ్ మండల ప్రచారక్ శ్రీను అన్నపూర్ణ, ఉష తదితర పలువురు నేతలతో పాటు అధిక సంఖ్యలో మహిళలు పంచాయతీ వాసులు మండల పదాధికారులు పాల్గొన్నారు.

## పెంట గ్రామంలో రైతుల పండుగ..





**458 పట్టాదార్ పాస్‌బుక్‌ల పంపిణీ**

**పద్మనాభం, పెన్ పవర్, ఫిబ్రవరి 06 :**పద్మనాభం మండలం పెంట గ్రామంలో రైతులకు శుభవార్త లభించింది. గ్రామంలోని రైతులకు సంబంధించిన భూ హక్కుల సమస్యలకు పరి ష్కారంగా మొత్తం 458 పట్టాదార్ పాస్‌బుక్ లను అధికారులు విజయవంతంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై రైతులకు స్వయంగా పాస్‌బుక్‌లను అందజేశా రు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరా వు మాట్లాడుతూ, రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. రైతులకు భూమిపై పూర్తి హక్కుల భద్రత కల్పించడంలో పట్టాదార్ పాస్‌బుక్‌లు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. భూ సంబంధిత లావాదేవీలు పారదర్శకంగా జరిగేలా, రైతులు తమ హక్కు లను సులభంగా వినియోగించుకునేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో భీమిలి ఆర్డిఓ సంగీత్ మాథుర్, పద్మనాభం తహసీల్దార్ కే. ఆనంద్ రావు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కోరాడ రమణ, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ డి. శ్యామల, వీఆర్వోలు సామ్యూల్, అప్పల రాజుతో పాటు ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.పెద్ద సంఖ్యలో రైతులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయగా, పట్టాదా ర్ పాస్‌బుక్‌ల పంపిణీ వేగంగా పూర్తి చేసినందు కు ఎమ్మెల్యేకి, రెవెన్యూ అధికారులకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంతో గ్రామంలో రైతులలో హర్షాతి రేకాలు వెల్లివిరిశాయి.

## భీమిలి నియోజకవర్గంలో రూ.1.69 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం



కృష్ణానగర్ కమ్యూనిటీ హాల్ ప్రారంభించిన ఎమ్మెల్యే గంటా



**భీమిలి, పెన్ పవర్, ఫిబ్రవరి 0 6 :**భీమిలి నియోజకవర్గంలోని జీవీఎంసీ 3వ వార్డులో అభివృద్ధి పనులు వేగం పుంజుకు న్నాయి. రూ.1.27 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. అలాగే రూ.42 లక్షలతో ఆధునికీకరిం చిన కృష్ణానగర్ కమ్యూనిటీ హాల్‌ను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మా ట్లాడుతూ, నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా పనులు చేపడుతున్నామని తెలిపారు. నేరళ్లవలస కాలనీ, ఎగువ పేట, గొల్లలపాలెం, అప్పికొండవారి వీధి, కృష్ణ కాలనీ, నల్లి వీధి తదితర ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయిన్లు సహా మౌలిక వసతుల పనులు త్వరలో ప్రారం భం కానున్నాయని చెప్పారు. ప్రస్తుతం నియోజ కవర్గంలోని ప్రతి జీవీఎంసీ వార్డులో సుమారు రూ.15 కోట్ల విలువైన అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని ఆయన వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ నాగేంద్ర, జడ్పీటీసీ గాడు వెంకటప్పుడు, కార్పొరేటర్లు గంటా అప్పలకొండ, గాడు చిన్ని కుమారి లక్ష్మి, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, గంటా నూకరాజు, గొలగాని నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ చిల్డ్రన్స్ పార్కులో 'ఫ్రైడే - డ్రైడే'కార్యక్రమం



**గుమ్మలక్ష్మీపురంలో ఫిబ్రవరి 06 పెన్ పవర్.** మండలంలో గల ఏ.పీ.ఆర్.జె.సి,కళాశాల సమీపంలో ఎన్టీఆర్ చిల్డ్రన్స్ పార్కులో ఫ్రైడే-డ్రై డే కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో ఆధ్వర్యంలో శుక్రవారం పారిశ్యుద్ధ కార్యక్రమాలు చేపట్టారు.ఈ మేరకు ఆయన మాట్లాడుతూ. గ్రామ ముస్తాబు లో భాగంగా పార్కును ఆహ్లోదకరంగా తీర్చిదిద్దుతామని,ఎంపీడీవో తెలిపారు.జెసిపి సహాయంతో పార్కు ఆవరణ అంతా శుభ్రం చేస్తున్నామని పరిసరాల పరిశుభ్రతకు గ్రామస్తుల కూడా స్వచ్ఛందంగా సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ఎన్ శేఖరం,ఎలివిన్ పేట సర్పంచ్ చైతన్య స్రవంతి. ఉన్నారు.

## పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడిగా డాక్టర్ లోకుల రమేష్ నియామకం



**గూడెంకొత్తవీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 6:**పశుసంవర్ధక శాఖ చింతపల్లి సహాయ సంచాలకుడు (ఏడీ)గా డాక్టర్ లోకుల రమేష్‌ను నియమిస్తూ అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.ప్రస్తుతం గూడెంకొత్తవీధి పశు వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ రమేష్‌ను చింతపల్లి ఏడీగా బాధ్యతలు అప్పగిస్తూ పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ దామోదర్ నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల మేరకు ఆయన త్వరలోనే నూతన బాధ్యతలు స్వీకరించనున్నారు.

## ఆనందపురం అంగన్వాడి కేంద్రంలో సామూహిక శ్రీమంతాలు



**ఆనందపురం, పెన్ పవర్,ఫిబ్రవరి 06-**
ఆనందపురం గ్రామంలో అంగన్వాడి కేంద్రంలో గర్భిణీలకు సామూహిక శ్రీమంతాలు నిరహించారు ఈ శ్రీమంతలు అంగన్వాడి కార్యకర్త కొట్యాడ కసులమ్మ వాళ్ళ తల్లి కొట్యాడ సర్వలక్ష్మి తన యొక్క సొంత నిధులతో శ్రీమంతాలు అంగన్వాడీలో చేయడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో గంభీరం షెక్టారు సూపర్వైజర్ జి శిరీష ముఖ్య అతిథిగా పాల్గొన్నారు సూపర్వైజర్ శిరీష మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు పౌష్టిక ఆహారం తీసుకోవాలని గర్భిణీ స్త్రీలు డెలివరి అయిన వెంటనే గంటలోపు ముర్రపాలు తల్లిపాలు బిడ్డకు పెట్టడం వల్ల బేబీకి రోగ నిరోధక శక్తి వస్తుందని ప్రతి ఒక్కరు కూడా బిడ్డకు తల్లిపాలు ఇవ్వాలని తెలిపారు ఈ యొక్క కార్యక్రమంలో గంభీరం షెక్టారు సూపర్వైజర్ జి శిరీష ఎ ఎన్ యం యం ఎల్ హెచ్ పి అంగన్వాడి కార్యకర్త కొట్యాడ కసూలమ్మ గర్భిణీలు బాలింతలు తల్లులు హాజరయ్యారు

# తగరపువలసలో బస్ కాంప్లెక్స్‌కు త్వరలో ఊపిరి



* వాణిజ్య మాల్‌తో సమగ్ర అభివృద్ధి: గంటా

**భీమిలి, పెన్ పవర్, ఫిబ్రవరి 06** :తగరపువలసలో ప్రతిపాదిత బస్ కాంప్లెక్స్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూల చర్యలు తీసుకుంటోందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. బస్ కాంప్లెక్స్ కోసం కేటాయించిన నాలుగు ఎకరాల భూమిని ఆర్టీసీ ప్రాంతీయ మేనేజర్ అప్పలనాయుడితో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని బస్ కాంప్లె క్స్‌తో పాటు వాణిజ్య కార్యకలాపాలకు అను కూలంగా మాల్‌ను కూడా అభివృద్ధి చేయనున్న ట్లు వెల్లడించారు. 2016లో శంకుస్థాపన చేసిన ప్పటికీ ఇప్పటివరకు కార్యరూపం దాల్చని ఈ బస్ కాంప్లెక్స్ ఈ ప్రాంత ప్రజల చిరకాల కలగా మారిందన్నారు.రవాణా రంగంలో చోటుచేసు కుంటున్న మార్పులకు అనుగుణంగా ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సులకు ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. మరో ఐదు నెలల్లో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పూర్తి స్థాయి కార్యకలాపాలు ప్రారంభించనున్న నేపథ్యంలో, తగరపువలస బస్ కాంప్లెక్స్‌కు భారీ డిమాండ్ ఏర్పడుతుందని చెప్పారు. నిర్మాణానికి సంబం ధించిన అంచనాలు, డిజైన్‌లను ఇప్పటికే ప్రభుత్వానికి పంపించినట్లు పేర్కొన్నారు.


ఇదే స్థలంలో గతంలో నిర్మించిన కబేళాలో ప్రస్తుతం ఎలాంటి కార్యకలాపాలు లేనందున, ప్రజాప్రయోజనాల కోసం ఇతర అవసరాలకు వినియోగించనున్నట్లు తెలిపారు. అలాగే అక్కడ ఉన్న ఆలయం అంశాన్ని సైతం పరిశీలిం చి సముచిత నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు ఉప్పు నీటిగా మారాయని, తాగునీటి సరఫరాలో జీవీఎంసీ నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని స్థానికులు ఫిర్యాదు చేసినట్లు గంటా తెలిపారు. ఈ సమస్యల పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ రూపొందిస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ నాగేంద్ర, జెడ్పీటీసీ గాడు వెంకటప్పడు, కార్పొరేటర్ గాడు చిన్ని కుమారి లక్ష్మి, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, తమ్మిన సూరిబాబు, కొప్పల రమేష్, జీరు సత్యం, భువనేశ్వరి, గొలగాని నరేంద్ర, గరికిన కింగ్, పాసి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.


03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి


## పూడిమడక ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ ను సందర్శించిన

ఏపీఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లు






**విశాఖ తూర్పు,పెన్ పవర్, ఫిబ్రవరి 6:** ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లు ముగడ రాజారావు,నీలాపు విజయానందరెడి,గురువారం విశాఖపట్నం జిల్లా పూడిమడక వద్ద ఉన్న ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ ను అధికారికంగా పర్యటించారు.

ఈ పర్యటనలో భాగంగా టెక్నాలజీ సెంటర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ జి. ప్రసాద రెడ్డి ని డైరెక్టర్లు మర్యాదపూర్వకంగా కలిశారు సెంటర్ ఇన్‌చార్జి చిన్న వెంకటేశం ఇతర స్థానిక అధికారులు సెంటర్ కార్యక్రమాలు,మౌలిక సదుపాయాలు,శిక్షణా విధానాలు, పరిశ్రమలతో ఉన్న అనుసంధానం తదితర అంశాలపై వివరంగా వివరణ ఇచ్చారు. సెంటర్ యొక్క పనితీరుపై డైరెక్టర్లు సమగ్ర సమాచారం తెలుసుకున్నారు.

కార్యక్రమంలో డైరెక్టర్లతో
సి జి.సి. నాయుడు,
బిజెపి రాష్ట్ర సీనియర్ నాయకులు ఎన్. గంగాధర్ యాదవ్,ఎస్. వెంకటేశ్వర్లు
చంద్రకాంత్ రెడ్డి,
శివం రెడ్డి,కొల్లి ఎర్రాజీ తరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ రంగం -- భారత ఆర్థిక వ్యవస్థకు ప్రధాన ఆధారం

ఎంఎస్ఎంఈ రంగం భారతదేశ ఆర్థిక వ్యవస్థలో అత్యంత చురుకైన మరియు వేగంగా అభివృద్ధి చెందుతున్న కీలక రంగంగా నిలుస్తోంది. ప్రస్తుతానికి దేశవ్యాప్తంగా మొత్తం 7.62 కోట్ల ఎంఎస్ఎంఈ యూనిట్లు ఉన్నాయి. వీటి ద్వారా సుమారు 33.6 కోట్ల మందికి ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా ఉపాధి లభిస్తోంది.

వర్గాల వారీగా చూస్తే
మైక్రో యూనిట్లు : 7.56 కోట్లు
స్మాల్ ఎంటర్‌ప్రైజెస్ : 4,88,779
మీడియం ఎంటర్‌ప్రైజెస్ : 36,830

ఈ గణాంకాలు ఎంఎస్ఎంఈ రంగం ఉపాధి సృష్టిలో, గ్రామీణ--పట్టణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో, అలాగే దేశ పారిశ్రామిక అభివృద్ధికి వెన్నెముకలా నిలుస్తున్నదని స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయి.

ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ -- విశాఖపట్నం

ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్, విశాఖపట్నం భారత ప్రభుత్వ సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, ప్రపంచ బ్యాంక్ సహకారంతో ఏర్పాటు చేయబడిన ప్రీమియం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్. ఈ సెంటర్ ద్వారా ఏరోస్పేస్, ఏవియేషన్, ఆటోమొబైల్, మెరైన్ రంగాలకు అవసరమైన డిజైన్, డెవలప్‌మెంట్, మాన్యుఫ్యాక్చరింగ్, టెస్టింగ్ మరియు క్యాలిబ్రేషన్ సేవలు అందించబడుతున్నాయి.

అలాగే మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం కింద స్వదేశీకరణ (ఇండిజెనైజేషన్), డిజైన్ మరియు తయారీ రంగాల్లో ప్రత్యేక దృష్టి సారించి, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఆటోమేషన్ విభాగాల్లో అనేక ప్రాజెక్టులను ఈ సెంటర్ అమలు చేస్తోంది.

నైపుణ్యాభివృద్ధి ఢ శిక్షణ

ఈ టెక్నాలజీ సెంటర్ ద్వారా ప్రపంచస్థాయి సాంకేతిక విద్య, నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు, అలాగే బహుశాఖల సమన్వయంతో వినూత్న పరిశోధన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. దీని ద్వారా పరిశ్రమలకు అవసరమైన నాణ్యమైన మానవ వనరులు తయారవుతున్నాయని అధికారులు తెలిపారు.

డైరెక్టర్ల అభిప్రాయం

ఈ సందర్భంగా డైరెక్టర్లు ముగడ రాజారావుమరియు నీలాపు విజయానందరెడ్ మాట్లాడుతూ, ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ వంటి సంస్థలు రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి, యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు కీలకంగా మారుతున్నాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఎంఎస్ఎంఈల అవసరాలకు అనుగుణంగా ఈ సెంటర్‌ను మరింత బలోపేతం చేయడానికి అన్ని విధాల సహకారం అందిస్తామని తెలిపారు.

## బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి





* కినపర్తి, చుట్టుబంద గ్రామాల్లో పర్యటించిన సీడీపీవో
* ఆయా గ్రామాల్లో బాల్య వివాహ ముక్త్ భారత్ కార్యక్రమాలు
* ఎవరైనా బాల్య వివాహాలకు పాల్పడితే కఠిన చర్యలు
* ఐసీడీఎస్ సీడీపీవో ఎల్.దేవమణి

**కొయ్యూరు,పెన్ పవర్ ఫిబ్రవరి 6:** బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో ఎల్.దేవమణి పిలుపునిచ్చారు. శుక్రవారం కినపర్తి, చుట్టుబంద గ్రామాల్లో సీడీపీవో పర్యటించారు. ముందుగా ఆయా గ్రామాల్లో ఉన్న అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అంగన్వాడీ సేవలను లబ్దిదారులకు సక్రమంగా అందించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం, బాల్య వివాహ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలతో కలిసి, బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలపై ఆయా గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా పెద్ద నేరమన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే పోలీసులకు, తమకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. దేశాన్ని బాల్య వివాహ రహిత దేశంగా చేయడమే లక్ష్యంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎవరైనా బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో అంగన్వాడీ, ఆశా సిబ్బంది, స్థానిక పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## కిరంబోలో తారు రోడ్డు నిర్మించాలని వినతి

* పాడేరు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం సమర్పణ.
* పీఎం జన్మన్ నిధులు మంజూరు చేసి తారు రోడ్డు నిర్మించాలి.
* మండల సిపిఎం నేత కె శంకర్రావు.




**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఫిబ్రవరి 06.** మండలంలో గల వనుగుమ్మ పంచాయతీ, కిరంబో గ్రామనికి తారు రోడ్డు సౌకర్యం కల్పించాలని శుక్రవారం పాడేరు ఐటిడిఏ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం అందజేసినట్లు సిపిఎం నాయకుడు, సిఐటియు మండల కార్యదర్శి కొర్ర శంకర్రావు అన్నారు. గ్రామంలో తారు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో వర్షాకాలంలో, అత్యవసర సమయంలో ఆసుపత్రికి వెళ్లాలన్న అంబులెన్స్ రావడానికి కష్టతరంగా మారిందని ఆయన అన్నారు. కిరంబోలో పివిటిజి వెనకబడిన 45 కుటుంబాలు ఏళ్ల తరబడిగా జీవనం సాగిస్తున్నప్పటికీ సరైన రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అనేక మార్లు పాడేరు ప్రజావేదిక స్పందన కార్యక్రమంలో దరఖాస్తు ఇచ్చిన రోడ్డు సమస్య పరిష్కారం కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన రాష్ట్ర కూటమి ప్రభుత్వం స్పందించి పీఎం జన్మన్ నిధులు కేటాయించి కిరంబో గ్రామంలో తారు రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పీసా కార్యదర్శి పాంగి సింగురు, పాంగి రాందాస్ పాంగి సాయి కుమార్ పాల్గొన్నారు.

## కిసాన్ మేళాతో రైతులకు ఆర్థిక పుష్టి

* వ్యవసాయాధారిత వ్యాపారవేత్తలుగా ఎదగాలి: ఎమ్మెల్యే గొండు శంకర్
* 50 స్టాళ్లతో కేవీకేలో ఘనంగా కిసాన్ మేళా



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ ఆమదాలవలస, ఫిబ్రవరి 06** :రైతులు కేవలం పంటలు పండించడమే కాకుండా, వాటిని ప్రాసెసింగ్ చేసి, గ్రూపులుగా ఏర్పడి మార్కెటింగ్ చేసుకోవడం ద్వారా ఆర్థికంగా లాభపడాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం, శ్రీకాకుళం జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్తంగా నిర్వహించిన 'కిసాన్ మేళా కార్యక్రమానికి ఆయన గౌరవ అతిథిగా హాజరయ్యారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి ఆయన 50కి పైగా ఏర్పాటు చేసిన వ్యవసాయ ఉత్పత్తుల స్టాళ్లను సందర్శించారు.

కార్యక్రమంలో మరో గౌరవ అతిథిగా పాల్గొన్న ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్. శారదా జయలక్ష్మి దేవి మాట్లాడుతూ.. ప్రతి రైతు కుటుంబం నుంచి ఒక వ్యవసాయాధారిత వ్యాపారవేత్త తయారవ్వాలని ఆకాంక్షించారు. ఇందుకోసం కేవీకేలు నిరంతరం సాంకేతికతను, శిక్షణను అందిస్తున్నాయని తెలిపారు. వర్సిటీ విస్తరణ సంచాలకులు డాక్టర్ జి. శివనారాయణ మాట్లాడుతూ పెసర సాగులో విలువాధారిత ఉత్పత్తుల ద్వారా వచ్చే లాభాలను వివరించగా, పరిశోధనా సంచాలకులు డాక్టర్ పి.వి. సత్యనారాయణ సాగులో రైతులు ఎదుర్కొంటున్న సందేహాలను నివృత్తి చేశారు.

ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహ పరిశోధనా సంచాలకులు డాక్టర్ సి.హెచ్. ముకుంద రావు, కేవీకే అధిపతి డాక్టర్ కె. భాగ్యలక్ష్మి, విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ జి.ఎస్. రాయ్ ఆధ్వర్యంలో ఈ సదస్సు దిగ్విజయంగా జరిగింది. కేవలం వరిపైనే ఆధారపడకుండా సమీకృత వ్యవసాయ విధానాలు అవలంబించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉత్తర కోస్తా మండల పరిశోధన స్థాన అధిపతులు, ప్రధాన శాస్త్రవేత్తలు, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, ఎఫ్.పి.ఓ సభ్యులు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పద్మనాభం మండలంలో ప్రత్యేక అధికారి విస్తృత పర్యటన





### పాఠశాలలు, సచివాలయం, పారిశుద్ధ్యంపై తనిఖీలు

### మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహణ

**పద్మనాభం, పెన్ పవర్, ఫిబ్రవరి 06** :పద్మనాభం మండల ప్రత్యేక అధికారి శ్రీమతి కె. జ్ఞాన వేణి శుక్రవారం బి.ఆర్. తాలవలస గ్రామ పంచాయతీని సందర్శించి విస్తృత స్థాయి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని జడ్‌పి హై స్కూల్‌ను సందర్శించిన ఆమె, పదవ తరగతి విద్యార్థులు మరియు ఉపాధ్యాయులతో పబ్లిక్ పరీక్షల సన్నద్ధతపై చర్చించారు. విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా క్రమబద్ధమైన అధ్యయనం, ఉపా ధ్యాయుల పర్యవేక్షణ కీలకమని సూచించారు.అనంతరం గ్రామంలోని హౌసింగ్ లే అవుట్‌ను పరిశీలించి, అభివృద్ధి పనుల పురోగతిపై అధి కారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి, అందుతు న్న సేవలు, రికార్డుల నిర్వహణ, ప్రజలకు సేవల అందుబాటు అంశాలపై సిబ్బందికి సూచనలు చేశారు. గ్రామ పారిశుద్ధ్య పరిస్థితులపై కూడా ప్రత్యేకంగా దృష్టి సారించి, శుభ్రతను నిరంతరం కొనసాగించాలని ఆదేశించారు.తదుపరి పద్మనాభం మండల కార్యాలయంలో అన్ని శాఖల మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి పనుల పురోగతి, ప్రజా సమస్యల పరిష్కారంపై సమన్వయంతో పనిచేయాలని అధికారులకు ఆమె దిశానిర్దేశం చేశారు.

ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి వి. నాగేష్, డిప్యూటీ మండల అభివృద్ధి అధికా రి బి.వి. రమణతో పాటు వివిధ శాఖల మండ ల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విశాఖ అభివృద్ధికి మంత్రి నారాయణ స్పష్టమైన దిశానిర్దేశం



- జీవీఎంసీ,వీఎంఆర్డీఏ అధికారులతో సమీక్ష
- మాస్టర్ ప్లాన్, గృహ నిర్మాణాలు, టూరిజం ప్రాజెక్టులపై కీలక నిర్ణయాలు

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఫిబ్రవరి 06 :**గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ , విశాఖపట్నం మెట్రో రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్డీఏ) పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రి నారాయణ గురువారం సమగ్ర సమీక్ష నిర్వహించారు. అమరావతిలో జరిగిన ఈ సమీక్షకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్, టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లతతో పాటు సంబంధిత శాఖల అధికారులు హాజ రయ్యారు. ఈ సందర్భంగా వీఎంఆర్డీఏ మాస్టర్ ప్లాన్ పురోగతి, జీవీఎంసీ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, నగర విస్తరణకు సంబంధం చిన ప్రణాళికలపై మంత్రి సమగ్రంగా చర్చించా రు. మాస్టర్ ప్లాన్‌పై ప్రజల నుంచి వచ్చిన అ భ్యంతరాలు, సూచనలను పరిగణనలోకి తీసు కుని మరోసారి నోటిఫికేషన్ జారీ చేయాలని మంత్రి ఆదేశించారు. విశాఖ నగరాన్ని పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చేయాలనే ఉద్దేశం తో కైలాసగిరి, కంభాలకొండ, జూ పార్క్‌లను సమన్వయం చేస్తూ ఒక సమగ్ర టూరిజం ప్రాజె క్టుగా అభివృద్ధి చేయాలని మంత్రి సూచించారు. ఇది నగర పర్యాటకానికి కొత్త ఊపునిస్తుందని పేర్కొన్నారు. వెలంపేట మురికివాడలో నివసిస్తు న్న 177 కుటుంబాలకు ఇళ్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన మంత్రి, త్వరలోనే శంఖుస్థాపన కార్యక్రమం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల ముఖ్యమంత్రి ఆదేశాల తో వెలంపేట స్లమ్‌ను స్వయంగా సందర్శించి అక్కడి ప్రజల సమస్యలను తెలుసుకున్నట్లు మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. అదేవిధం గా విశాఖపట్నం నగరానికి సంబంధించిన సమ గ్ర నీటి రక్షణ ప్రణాళికపై కూడా సమీక్ష జరిపిన మంత్రి నారాయణ, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని దీర్ఘకాలిక ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

విశాఖ నగరాన్ని అభివృద్ధి, పర్యాటకం, మౌలిక వసతుల పరంగా దేశంలోనే అగ్రగామిగా తీర్చిది ద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

## దారకొండ హెచ్‌ఎంపై శాఖపరమైన చర్యలు

- విద్యార్థులను కొట్టడం వాస్తవమే: డిప్యూటీ డైరెక్టర్ పరిమళ



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 6,**అల్లూరి జిల్లా గూడెం కొత్త వీధి మండలం దారకొండ బాలుర ఆశ్రమ పాఠశాలలో ఇద్దరు విద్యార్థులను తీవ్రంగా కొట్టి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఘటన జిల్లా వ్యాప్తంగా సంచలనంగా మారింది. ఈ ఘటనపై గిరిజన ప్రజా సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్రంగా ఖండించారు. సంఘటనపై శుక్రవారం పాడేరు డిప్యూటీ డైరెక్టర్ పరిమళ, ఏటిడబ్ల్యూ నాగ జయలక్ష్మి కలిసి ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా విద్యార్థులను విడివిడిగా విచారించి వివరాలు సేకరించారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం హేమచంద్రతో మాట్లాడి విద్యార్థులను ఎందుకు కొట్టాల్సి వచ్చిందని ప్రశ్నించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం తొలుత మౌనం పాటించగా, వాస్తవాలు చెప్పాలని డీడీ హెచ్చరించడంతో భోజనం బాగోలేదని విద్యార్థులు అడిగారని, వారిని కొట్టిన విషయం నిజమేనని అంగీకరించారు. ఈ విషయంపై డిప్యూటీ డైరెక్టర్ పరిమళ విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులపై దాడి ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపామని తెలిపారు. హెచ్‌ఎం చేసిన తప్పిదంపై పూర్తి నివేదికను ఐటిడిఏ పీవో, జిల్లా కలెక్టర్లకు అందజేస్తామని, హెచ్‌ఎంపై శాఖపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పాడేరు--అరకు నియోజకవర్గాల్లోని అన్ని ఆశ్రమ పాఠశాలల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు చదువు, మంచి భోజనం అందించేందుకు మాత్రమే ఉండాలని, వారిని కొట్టే అధికారం ఎవరికీ లేదని ఆమె స్పష్టం చేశారు.

హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలి: గిరిజన సంఘాలు

ఈ ఘటనపై గిరిజన సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భోజనం బాగోలేదని అడిగినందుకు పిల్లలను దారుణంగా కొట్టడం అమానుషమని విమర్శించారు. పాఠశాలలో మెనూ సక్రమంగా అమలు కావడం లేదని, మౌలిక సదుపాయాలు లేనప్పటికీ విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో హెచ్‌ఎ ప్రవర్తన అంగీకారయోగ్యం కాదని, ఆయనపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పదో తరగతి వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

త్వరలో జరగనున్న పదో తరగతి పరీక్షల నేపథ్యంలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని డిప్యూటీ డైరెక్టర్ పరిమళ తెలిపారు. సీలేరు బాలికల ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది ఐదు వేలకుపైగా పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. గత ఏడాదికన్నా ఉత్తీర్ణత శాతం పెంచేందుకు కొత్త డీఎస్సీ ఉపాధ్యాయులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. వెనుకబడిన విద్యార్థులకు రోజూ అదనంగా రెండు గంటల తరగతులు నిర్వహిస్తూ వంద రోజుల యాక్షన్ ప్లాన్‌ను కఠినంగా అమలు చేస్తున్నామని, ప్రతిరోజూ సబ్జెక్టు వారీగా పరీక్షలు నిర్వహించి మార్కులను ఆన్లైన్‌లో నమోదు చేస్తున్నామని వివరించారు. ఎలాంటి లోటుపాట్లు జరిగినా ఉపేక్షించేది లేదని ఆమె హెచ్చరించారు.

## దారకొండ బాలురు ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఎంపీపీ



**గూడెంకొత్తవీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 6:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం దారకొండ బాలురు ఆశ్రమ పాఠశాలలో హెచ్‌ఎం ఇద్దరు విద్యార్థులను భారీగా కొట్టడంతో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంఘటన పత్రికల్లో ప్రచారమైన నేపథ్యంలో గూడెంకొత్తవీధి ఎంపీపీ బోయిన కుమారి శుక్రవారం ఆ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి జరిగిన సంఘటన గురించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థులను చదువు కోసం దండించవచ్చు కానీ భారీగా దాడి చేయడం తగదు అని చెప్పారు. అలాగే విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. విద్యార్థులకు వంట చేసేందుకు సరిపడిన వంట మనుషులను నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. పాఠశాల విద్యార్థులకు పదవ తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు బాగా చదివి పరీక్షలు బాగా రాయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దారకొండ సర్పంచ్ నడిగట్ల రాజు, ఎంపీటీసీ రామన్న, జీకే వీధి ఉపసర్పంచ్ రాంబాబు, నాయకులు బుజ్జి, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## మరింతగా ప్రకాశించనున్న మత్స్యసాగరమాల

- నేటి నుండి రెండవ విడత ఇన్స్టలేషన్
- మొదటి దశలో విజయవంతంగా 1594 లైట్ల ఏర్పాటు.
- రెండవ దశలో 28 గ్రామాల్లో 576 లైట్ల ఇన్స్టలేషన్



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, శ్రీకాకుళం. ఫిబ్రవరి 06 :** కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చేపట్టిన ప్రతిష్టాత్మక కార్యక్రమం మత్యసాగర మాల.. ఇప్పటికే గంగపుత్రుల జీవితాల్లో కొత్త వెలుగులు పంచుతున్న సంగతి తెలిసిందే. శ్రీకాకుళం పార్లమెంట్ పరిధిలోని మత్స్యకార గ్రామాల్లో తీరానికి వెళ్లే రహదారులకు వెలుగులు అందించాలనే లక్ష్యంతో కోల్ ఇండియా సంస్థ సి.ఎస్.ఆర్ నిధులను ఉపయోగించుకుని సోలార్ లైటింగ్ ను రామ్మోహన్ నాయుడు ఏర్పాటు చేశారు. మొదటి దశలో జిల్లాలోని 1594 లైట్లను 91 పైగా గ్రామాల్లో 100పైగా తీరానికి ఉన్న దారుల్లో ఏర్పాటు చేశారు. పూర్తిగా సూర్యరశ్మిని ఉపయోగించుకుని ఎటువంటి ఖర్చు లేకుండా తీరంలో విశేషంగా వెలుగులు అందిస్తున్న మత్స్యసాగర మాల పథకం పట్ల సిక్కోలు గంగపుత్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సగటున ఒక్కో గ్రామానికి 30కి పైగా లైట్లను ఏర్పాటు చెయ్యగా ఒక్కో లైటు విలువ 27 వేలకు పైగా అవుతుండటం గమనార్హం. శ్రీకాకుళం తీరప్రాంతం అంతటికీ వెలుగులు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్న రామ్మోహన్ నాయుడు.. మొదటి విడత ఇన్స్టలేషన్ విజయవంతంగా పూర్తి అవ్వడం.. అంతే స్థాయిలో పథకం సత్ఫలితాలు అందిస్తూ ఉండటంతో.. రెండవ విడత లైట్ల ఏర్పాటుకు దిశా నిర్దేశం చేశారు. ఈ రెండవ విడతలో భాగంగా జిల్లాలోని మందస, వజ్రపుకొత్తూరు, గార తో పాటు శ్రీకాకుళం రూరల్ మండలాల్లో 28 గ్రామాల్లో 576 లైట్లను ఏర్పాటు చెయ్యనున్నారు. ఇందుకోసం అవసరమైన మెటీరియల్ ఇప్పటికే గ్రామాలకు చేరగా.. ఇన్స్టలేషన్ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రెండవ విడత లైట్ల ఏర్పాటు ప్రక్రియ మరొక్క పది రోజుల్లో ముగుస్తుందని పర్యవేక్షక కమిటీ స్పష్టం చేశారు. కాగా మత్స్యకారులు.. తాము వేట మొదలు పెట్టిన నాటి నుండి ప్రధాన సమస్యగా మారిన ఈ అంధకార సమస్యను.. తాము అడగకుండానే పరిష్కారం చూపించిన రామ్మోహన్ నాయుడు కు సిక్కోలు మత్స్యకారులు ధన్యవాదాలు తెలుపుతున్నారు. దేశానికి మారుమూలన ఉన్న శ్రీకాకుళం జిల్లాలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మస్తిష్కం నుండి పుట్టిన ఈ ఆలోచన.. ఇప్పుడు దేశానికి ఆదర్శంగా మారింది.

## అభివృద్ధి పనులపై కార్పొరేటర్ బొమ్మిడి రమణ పరిశీలన

**అమ్మవారి ఆలయ ద్వితీయ వార్షికోత్సవంలో పాల్గొన్న 90వ వార్డ్ కార్పొరేటర్**





**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, ఫిబ్రవరి 6 :** నగరంలోని జీవీఎంసీ 90వ వార్డు అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోంది. ఈ క్రమంలో వార్డ్ కార్పొరేటర్, మాజీ స్టాండింగ్ కమిటీ సభ్యులు బొమ్మిడి రమణ కనకమహాలక్ష్మినగర్‌లో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మొదటగా, కనకమహాలక్ష్మి నగర్‌లో గతంలో శంకుస్థాపన చేసిన పార్క్ అభివృద్ధి పనులను కార్పొరేటర్ పరిశీలించారు. పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, ప్రజలకు ఉపయోగపడేలా పనులు పూర్తి చేయాలని స్పష్టంగా ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం సహించేది లేదని తెలిపారు. ఈ పరిశీలన కార్యక్రమంలో కనకమహాలక్ష్మి నగర్ కాలనీ నాయకులు బి.టి.నాయుడు, ఇడదాశరి గోపాల్, ప్రసాద్, సిద్ధ భాస్కర్, పిల్లల మాణిక్యం, పోతల సతీష్, సన్నీ తదితరులు పాల్గొని సహకరించారు.

అనంతరం అదే రోజు కనకమహాలక్ష్మినగర్‌లో నూతనంగా నిర్మించిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయ ద్వితీయ వార్షికోత్సవ మహోత్సవం సందర్భంగా కార్పొరేటర్ బొమ్మిడి రమణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వార్డ్‌లో సమస్యలకు ఆస్కారం లేకుండా తక్షణ పరిష్కారాలు అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. అభివృద్ధితో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కూడా తాము ఎల్లప్పుడూ మద్దతుగా ఉంటామని పేర్కొన్నారు.

చివరగా "సదా ప్రజల సేవలో ఉండటం నా బాధ్యతని చెబుతూ, ప్రజల సహకారంతోనే వార్డు అభివృద్ధి సాధ్యమవుతుందని కార్పొరేటర్ బొమ్మిడి రమణ గారు అన్నారు.

## మహాశివరాత్రి ఏర్పాట్లు స్వయంగా పరిశీలించిన కలెక్టర్





- క్యూలైన్లు, సౌకర్యాలపై అధికారులకు కీలక ఆదేశాలు
- 18న చక్రతీర్థం.. ఏర్పాట్లు పక్కాగా ఉండాలని స్పష్టం

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, శ్రీకాకుళం. ఫిబ్రవరి 06:** మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతున్న శ్రీముఖలింగం క్షేత్రాన్ని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ జిల్లా ఎస్పీ కె.వి మహేశ్వర రెడ్డి నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి తో కలిసి మంగళవారం క్షేత్రస్థాయిలో సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయ పరిసరాలను క్షుణ్ణంగా తనిఖీ చేసిన ఆయన, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దర్శనానికి వచ్చే భక్తుల కోసం ఏర్పాటు చేస్తున్న క్యూలైన్లు, మంచినీటి వసతి, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ పనులను కలెక్టర్ పర్యవేక్షించారు. అత్యవసర సేవల కోసం మెడికల్ టీమ్స్, అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచాలని, పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఉత్సవాల పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. భద్రత విషయంలో రాజీ పడకూడదని, సీసీ కెమెరాలతో పాటు డ్రోన్ల ద్వారా నిరంతరం నిఘా ఉంచాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

చక్రతీర్థ యాత్రకు ప్రత్యేక ప్రణాళిక :

ఉత్సవాల్లో అత్యంత కీలకమైన చక్రతీర్థ స్నానాల ఏర్పాట్లపై కలెక్టర్ సుదీర్ఘంగా చర్చించారు. 18వ తేదీన ఉదయం 10 గంటల వరకే భక్తులకు దర్శనాలు ఉంటాయని, మధ్యాహ్నం 12 గంటలకు చక్రతీర్థ యాత్ర ప్రారంభమవుతుందని ఆలయ సిబ్బంది ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. 17వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచే ఒడిశా తదితర ప్రాంతాల నుంచి యాత్రికుల రద్దీ పెరుగుతుందని, వారందరికీ ఎటువంటి అసౌకర్యం కలగకుండా పార్కింగ్ స్థలాలు, ఇతర వసతులు సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు.

నాలుగు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో ప్రతి అధికారి బాధ్యతగా పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా చక్రతీర్థ స్నానాల రోజు భక్తుల తాకిడి ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున, వంశధార నది తీరంలో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. భక్తులకు అవసరమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు చేరవేసేలా చూడాలన్నారు. జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ వివిధ శాఖల అధికారులు కు సీసీటీవీ, పార్కింగ్ ప్రదేశాలు ,కంట్రోల్ రూమ్ లో ఉండవలసిన ఇతర శాఖల సిబ్బంది కి సూచనలు జారీ చేశారు. శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ వివిధ శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేసి మహాశివరాత్రి ఉత్సవాలు సజావుగా సాగేందుకు కృషి చేయాలని కోరారు. ఈ క్షేత్రస్థాయి పర్యటనలో జిల్లా కలెక్టర్ తో పాటు రెవెన్యూ, పోలీస్, దేవాదాయ, జలవనరులు శాఖల అధికారులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పార్కులు,స్మశానాల అభివృద్ధికి అసోసియేషన్ల భాగస్వామ్యం

భీమిలి రోడ్ల విస్తరణపై సమగ్ర నివేదికకు ఎమ్మెల్యే ఆదేశం



**భీమిలి, పెన్ పవర్, ఫిబ్రవరి 06 :**స్థానిక అసోసియేషన్లకు బాధ్యతలు అప్పగిం చడం ద్వారా పార్కుల అభివృద్ధి, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులతో స్మశానాల అభివృద్ధి చేపట్టాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సూచించారు. భీమిలి క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం జీవీఎంసీ మధుర వాడ, భీమిలి జోన్ల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. రెండు జోన్ల పరిధిలో ఉన్న పార్కులు, ఓపెన్ స్పేస్‌లు, స్మశా నాల వివరాలు, అక్కడ నెలకొన్న సమస్యలపై సమగ్ర సమాచారం అందజేయాలని అధికారుల ను ఆదేశించారు. ప్రణాళిక లేకుండా అండర్‌గ్రౌం డ్ విద్యుత్ కేబుల్స్ కోసం గోతులు తవ్వడం వల్ల రోడ్లు, ప్రజల ఇబ్బందులు పెరిగాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. భీమిలి బీచ్ రోడ్డు, మెయిన్ రోడ్డు, తగరపువలస రోడ్డు విస్తరణ వల్ల ఎన్ని కట్టడాలు ప్రభావితమవుతు న్నాయో త్వరితగతిన నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. గతంలో భీమిలి తగరపువలస రోడ్డు విస్తరణకు 150 అడుగుల ఆర్డీపీ రూపొం దించినప్పటికీ, ప్రస్తుతం 80 అడుగులకు పరిమితం చేయాలంటూ స్థానికుల నుంచి విజ్ఞప్తులు వస్తున్నట్లు అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. ఎండాడ రైతుబజార్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని గుర్తించాలని, నిర్మాణంలో ఉన్న సాగర్‌నగర్--ఎండాడ రోడ్డు మధ్యలో ఉన్న అడ్డంకులను తొలగించాలని ఆయన ఆదేశించారు. భీమిలిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, ఫిల్టరేషన్ ప్లాంట్ లేకపోవ డంతో క్లోరినేటెడ్ నీటినే తాగాల్సి వస్తోందని స్థానిక నాయకులు ఫిర్యాదు చేయగా, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచిం చారు. చిల్లపేట చెరువు, ఎండాడ చెరువు పరిసరాల్లో వాకింగ్ ట్రాక్‌లతో పాటు సుందరీ కరణ పనులకు డిజైన్లు సిద్ధం చేయాలని, అసంపూర్తిగా ఉన్న కళ్యాణ మండపాలను గుర్తించి పూర్తిచేయాలని తెలిపారు. తగరపువ లసలో కొత్త కళ్యాణ మండపం కోసం స్థలాన్ని అన్వేషించాలని అధికారులకు సూచించారు.

పర్యాటకులను ఆకర్షించేలా భీమిలి బీచ్ రోడ్డు లో విగ్రహాల ఏర్పాటు, గంట స్తంభం సమీపం లోని మార్కెట్ వివాద పరిష్కారం, లైట్ హౌస్ ప్రాంత అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో జోనల్ కమిషనర్లు వి. అయ్యప్ప నాయుడు, నాగేంద్ర, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శాంతిరాజు, కార్పొరేటర్ గాడు చిన్ని కుమారి లక్ష్మి, కూటమి నాయకులు చిక్కాల విజయ్‌బాబు, గంటా నూకరాజు, గొలగాని నరేంద్ర, మొల్లి లక్ష్మణరావు, మాన్యాల సోంబా బు, కె. అచ్యుతరావు, లొడగల జానకిరామ్, కొప్పల రమేష్, తమ్మిన సూరిబాబు, చెట్టిపల్లి సన్యాసిరావు, పాసి త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com